నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | మంగళవారం 18-5-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 240 | పేజీలు: 4 | వెల: రూ.1/-

తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్ , మే 17: కరోనా పరిస్థితులపై హైకోర్టుల విచారణ జరిగింది. ఆక్సిజన్, ఔషధాలపై తెలంగాణ హైకోర్టుకు కేంద్రం ప్రభుత్వం నివేదిక సమర్పించింది. ఇతర రాష్ట్రాల నుంచి 35 శాతం కోవిడ్ రోగులు చికిత్స పొందుతున్నారన్న తెలంగాణ వినతిని పరిగణనలోకి తీసుకున్నట్లు పేర్కొంది. ప్రధాని ఆదేశాల మేరకు తెలంగాణకు కోటా పెంచినట్లు కేంద్రం తెలిపింది. ఆక్సిజన్ 450 మెట్రిక్ టన్నుల నుంచి 650 మెట్రిక్ టన్నుల పెంచామని, రెమిడిసివిర్ ఇంజక్షన్లు 5 వేల నుంచి 10 వేలకు పెంచినట్లు వివరించింది. కేంద్ర ప్రభుత్వ స్పందనపై హైకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది.

ప్రతి జిల్లాలో కమ్యూనిటీ కిచన్‌లు ఏర్పాటు చేసి లాక్‌డౌన్‌లో ఉచిత భోజనం కల్పించాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. కార్పొరేషన్‌లు ఎన్‌జీఓలతో ఒప్పందం చేసుకుని కమ్యునిటి కిచన్‌లు ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలని తెలిపింది. ప్రతిజిల్లా వెబ్ సైట్‌లో కమ్యూనిటీ కిచన్ వివరాలు పొందుపరచాలని హైకోర్టు సూచించింది. వ్యాక్సినేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సీనియర్ సిటిజన్‌లు, పేదవారికి వ్యాక్సినేషన్ కోసం ఎన్‌జీవోలతో ఒప్పందం చేసుకుని డ్రైవ్ ఇన్ వ్యాక్సినేషన్ పెట్టాలని తెలిపింది. కోవిడ్ టెస్టులను ప్రభుత్వం ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించింది. 13 జిల్లాల్లో కేవలం 20 వేల టెస్టులు మాత్రమే చేశారని పేర్కొంది. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ లో 3లక్షలు టెస్ట్ లు మాత్రమే చేశారని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.

ఎలక్షన్ డ్యూటీలో ఉండి 500 మంది టీచర్లు కరోనా బారిన పడ్డారని? 15 మంది టీచర్ల ప్రాణాలు కోల్పోయారని పిటిషనర్ కోర్టుకు తెలియజేశారు. దీనిపై స్పందించిన కోర్టు ఎలక్షన్ డ్యూటీలో ఉండి కరోనా బారిన పడిన టీచర్లను కోవిడ్ వారియర్లుగా గుర్తించాలని పేర్కొంది. వారికి ప్రభుత్వం నుండి అన్ని విధాలుగా సహకారం అందించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

కరోనా తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ సమయంలో నిబంధనలు పటిష్టంగా అమలు చేస్తున్న హైదరాబాద్ , సైబరాబాద్, రాచకొండ కమిషనర్లను తెలంగాణ హైకోర్టు అభినందించింది. లాక్‌డౌన్ సమయంలో, రిలాక్సేషన్ సమయంలో వీడియో గ్రఫీ తీసిన ఫుటేజ్‌ను ముగ్గురు కమిషనర్లు హైకోర్టుకు సమర్పించారు. ఔషధాల బ్లాక్ మార్కెట్ పై 98 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద 57 సహాయ కేంద్రాల ఏర్పాటు చేశామని, లాక్ డౌన్, రాత్రి కర్ఫ్యూ పకడ్బందీ అమలుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ నెల 1 నుంచి 14 వరకు 4,31,823 కేసులు నమోదు తెలిపారు. మాస్కులు ధరించనందుకు 3,39,412 కేసులు, రూ.31కోట్ల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. భౌతిక దూరం పాటించనందుకు 22,560 కేసులు, కర్ఫ్యూ నిబంధనల ఉల్లంఘనపై 26,082 కేసులు నమోదు చేశామని చెప్పారు. లాక్ డౌన్, రాత్రి కర్ఫ్యూ అమలు తీరుపై హైకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. లాక్ డౌన్ సమయంలో ఉదయం 6 నుంచి 10 వరకు గైడ్ లైన్స్ ను పటిష్టంగా అమలు చేసినందుకు ముగ్గురు సీపీలకు హైకోర్టు అభినందనలు తెలిపింది. పోలీసులు ఇదే విధంగా పని చేయాలని హైకోర్టు సూచించింది.

ఇక, మూడో దశ కరోనాను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఎలా సన్నద్ధమవుతుందో పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. బ్లాక్ ఫంగస్ చికిత్సలకు ఏర్పాట్లు, ఔషధాలపై వివరాలు సమర్పించాలని తెలిపింది. కోవిడ్ తో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను ఎలా అదుకుంటున్నారో నివేదిక ఇవ్వాలని పేర్కొంది. అనాథలుగా మారిన పిల్లల అక్రమ రవాణా, అక్రమ దత్తత ప్రమాదం పొంచి ఉందని హైకోర్టు అభిప్రాయపడింది.

నిరంతరాయంగా రామన్న భరోసా

హైదరాబాద్ , మే 17: కరోనా సెకండ్ వేవ్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ కొవిడ్ బాధితులకు చేసే సహాయం కొనసాగుతోంది. కొవిడ్ నుంచి పూర్తిగా ఇటీవలే కోలుకున్న ఆయన సోషల్ మీడియాలో మళ్లి యాక్టివ్ అయ్యారు. ట్విట్టర్ వేదికగా ఇంజక్షన్లు, మందులు, ఆక్సిజన్ సిలిండర్లు ఏవీ కావాలని అడిగినా వెంటనే స్పందించి తన కార్యాలయానికి ఆ పనిని అప్పగిస్తున్నారు. తన వ్యక్తిగత కార్యాలయ సిబ్బంది ఆ పనిని పూర్తి చేసే వరకు స్వయంగా పర్యవేక్షించి అవసరాంధ్రలకు సాయ ం అందిస్తున్నారు. శని, ఆది వారాల్లో ట్విట్టర్ వేదికగా పలువురికి కేటీఆర్ రెమిడెసివిర్ ఇంజక్షన్‌లు, ప్లాస్మా తదితర కొవిడ్ సంబంధిత అవసరాలు తీర్చారు.

వైజాగ్ వాసి వేడుకోలు? ఏపీ మంత్రికి మేకపాటికి కేటీఆర్ రిక్వెస్ట్

తన తండ్రి వైజాగ్‌లోని ఓ ఆస్పత్రిలో కొవిడ్ చికిత్స తీసుకుంటూ అపస్మారక స్థితిలోకి వెళ్లాడంటూ ఒక యువకుడు ట్వీట్ చేస్తూ చివరి ప్రయత్నంగా తనకు డీఆర్డీఓ రూపొందించిన 2 డీజీ డ్రగ్ కావాలని అడగగా తన స్నేహితుడు మేకపాటి గౌతమ్ సాయం చేస్తారని ఆ యువకునికి సమాధానమిచ్చారు. వెంటనే ఏపీ మంత్రి స్పందించి తాను ఆ సమస్యపై దృష్టి సారిస్తానని కేటీఆర్‌కు మాటిచ్చారు. అలాగే పలువురు ఏపీకి చెందిన వారు ట్విట్టర్‌లో కేటీఆర్‌ను సాయమడగగా అక్కడి మంత్రి మేకపాటి గౌతమ్‌కు ఆ పనులు అప్పగించారు.

జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్‌కు కేటీఆర్ విజ్ఞప్తి

కొవిడ్‌తో జార్ఖండ్‌లో చికిత్స పొందుతున్న ఒక యువతిని హైదరాబాద్‌కు ఎయిర్ లిఫ్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్నారని, బెడ్ ఇవ్వగలిగితే వస్తారని కేటీఆర్‌కు ఆ యువతి స్నేహితుడు విజ్ఞప్తి చేయగా వెంటనే ఆ విషయాన్ని కేటీఆర్ జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్ దృష్టికి ట్విట్టర్‌లో తీసుకెళ్లారు.

కరోనా కట్టడిలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ - కేంద్రం ప్రశంస

హైదరాబాద్ , మే 17: : కరోనా వైరస్ కట్టడిలోనూ, కోవిడ్ చికిత్సలకు వైద్య సదుపాయాలు కల్పించడంలోనూ దేశంలో మెరుగైన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం నిలిచింది. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. ఈ మేరకు కోవిడ్ చికిత్సలు, వైద్య సదుపాయాల అంశాల వారీగా కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ కొన్ని ప్రమాణాలను రూపొందించింది. రాష్ట్రాలను మెరుగైన, మోస్తారు, తక్కువ, అతి తక్కువ శ్రేణులుగా వర్గీకరించింది. ఇందులో మెరుగైన స్థానంలో కోవిడ్ చికిత్సలోనూ, వైద్య సదుపాయాల కల్పనలోనూ మెరుగైన స్థానంలో తెలంగాణ ఒకే ఒక్క రాష్ట్రం ఉంది. ఇక హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండెక్స్ లో మోస్తారు (యావరేజ్) స్థానంలో రాజస్తాన్, హర్యానా నిలిచాయి. కోవిడ్ కట్టడిలో యావరేజ్‌గా పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ ఉండగా? గుజరాత్, జమ్మూ కశ్మీర్ తక్కువ స్థితిలో, అతి తక్కువ స్థితిలో మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాలు ఉన్నాయి. కరోనా కట్టడిలో ఓడిశా, ఝార్ఖండ్, అస్సాం, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలు రెడ్ జోన్‌లో ఉన్నాయి.

కొవిడ్ విజృంభణలోనూ ప్రజలకు సౌకర్యాలు..

హైదరాబాద్ , మే 17: ప్రస్తుత సెకండ్ వేవ్‌లో కరోనా విజృంభించిన పరిస్థితుల్లోనూ ప్రజలకు అన్ని సౌకర్యాలు కలుగజేయడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ,పరిశ్రమల మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఈ విపత్కర సమయంలో ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు పలు కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చాయని, ఇతర సంస్థలు కూడా ముందుకు వచ్చి సహాయసహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌కు గ్రీన్‌కో సంస్థ తెప్పించిన ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ల కార్గో విమానానికి రాష్ట్ర సీఎస్ సోమేష్‌కుమార్, గ్రీన్ కో సంస్థ ప్రతినిధులతో కలిపి కేటీఆర్ స్వాగతం పలికారు. గ్రీన్‌కో సహ వ్యవస్థాపకులు అనిల్ చలమశెట్టి, కొల్లి మహేష్‌తో కలిసి విమానంలోని ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌లను పరిశీలిం చారు.ఇతర రాష్ట్రాల్లో ఆక్సిజన్ అందక జరిగిన దురదృష్టకర సంఘటనలు తెలంగాణలో చోటు చేసుకోలేదని తెలిపారు. ఆక్సిజన్, కొవిడ్ మందుల సరఫరాలో తెలంగాణ ఇతర రాష్ట్రాల కంటే ముందుందని అన్నారు. సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కేంద్ర ప్రభుత్వం, ఇతర వైద్య సంస్థలతో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం వల్లే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. పచ్చదనం, పరిశుభ్రతతో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించే ప్రాజెక్టులను చేపడుతున్న రెన్యువబుల్ ఎనర్జీ గ్రీన్‌కో సంస్థ చైనా నుంచి ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌లను దిగుమతి చేసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం చుట్టు పక్కల ఉన్ననాలుగు రాష్ట్రాల నుంచి వస్తున్న కరోనా రోగులకు చికిత్స అందిస్తున్నందున ఆ మేరకు అవసరమైన మందులు, ఆక్సిజన్ సరఫరా పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా వారు సానుకూలంగా స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో రాజకీయాలకతీతంగా అందరినీ కలుపుకుని పోతున్నామన్నారు. గ్రీన్ కో సంస్థ తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తోడుగా నిలిచేందుకు ముందుకు వచ్చి ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌లను అందించినందుకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత కరోనా పరిస్థితుల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు అందించేం దుకు ఒక వెయ్యి కాన్సంట్రేటర్‌లను తీసుకురావడం, అందులో తొలిదశగా వచ్చిన 200 ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌లను తెలంగాణకు ఇవ్వడాన్ని ఆయన కొనియాడారు. ఈ పరికరాలను చైనా నుంచి తెలంగాణకు తీసుకువచ్చేందుకు ఇండిగో సంస్థ సైతం తన ప్యాసింజర్ ఫ్లైట్‌ని ఉపయోగించి మరీ తీసుకురావడంపై ఇండిగో విమాన సంస్థకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. గ్రీన్‌కో సంస్థ దిగుమతి చేసుకుని ప్రభుత్వానికి అందజేసిన ఈ ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌లు ఒక్కొక్కటి నిమిషానికి 10 లీటర్ల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తాయని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

దేశంలో వైరస్ పాజిటివిటీ రేటు 18.17 శాతం

న్యూఢిల్లీ, మే 17: న్యూఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ పాజిటివిటీ రేటు తగ్గుతున్నది. ప్రస్తుతం ఈ వారానికి దేశంలో వైరస్ పాజిటివిటీ రేటు 18.17 శాతంగా ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొన్నది. రోజువారీ కోవిడ్ పాజిటివ్ కేసులు కూడా తగ్గినట్లు ప్రభుత్వం వెల్లడించింది. 26 రోజుల తర్వాత.. కరోనా వైరస్ పాజిటివ్ కేసులో తొలిసారి మూడు లక్షల లోపు నమోదు అయినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. గత 24 గంటల్లో సుమారు 15.73 లక్షల వైరస్ పరీక్షలు చేసినట్లు ప్రభుత్వం పేర్కొన్నది.ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు 20 కోట్ల మేర వ్యాక్సిన్లు అందించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇంకా సుమారు రెండు కోట్ల టీకాలు పలు రాష్ట్రాల వద్ద ఉన్నట్లు ప్రభుత్వం చెప్పింది. మరో మూడు రోజుల్లో అన్ని రాష్ట్రాలకు అదనంగా మూడు లక్షల డోసులు అందివ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

ముంబైలో భారీ వర్షాలు..
శంషాబాద్‌లోనే ల్యాండైన విమానం

హైదరాబాద్,మే 17: తౌటే తుపాను కారణంగా ముంబైలో భారీ వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ముంబై విమానాశ్రయాన్ని మూసివేశారు. దీంతో బ్యాంకాక్ నుంచి ముంబై వెళ్లాల్సిన ఎయిర్ ఏషియా (చీఏ218) విమానం శంషాద్ ఎయిర్‌పోర్టులోనే ల్యాండ్ అయింది. ముంబైకి వెళ్లాల్సిన పలు విమానాలను శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మళ్లిస్తున్నట్లు సమాచారం.

అరేబియా సముద్రంలో ఏర్పడిన తౌటే తుఫాను పెను తుఫానుగా మారి గుజరాత్‌వైపు పయనిస్తోంది. ఇప్పటికే ఈ తుఫానుతో కేరళ, కర్ణాటక, గోవా తీర ప్రాంతాలు భారీగా దెబ్బతిన్నాయి. గుజరాత్‌లో పెను విధ్వంసం సృష్టించే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ఈ తుఫాను ఉత్తర, వాయవ్య దిశగా పయనించి సోమవారం సాయంత్రానికి గుజరాత్ తీరాన్ని తాకి, మంగళవారం తెల్లవారుజామున పోరుబందర్- మహువా (భావ్‌నగర్ జిల్లా) ల మధ్య తీరాన్ని దాటనుందని వెల్లడించింది.

తుఫాను గంటకు 18 కిలోమీటర్ల వేగంతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో గుజరాత్‌తో పాటు కేంద్రపాలిత ప్రాంతాలైన డామన్ దయ్యూ 'ఆరెంజ్ అలర్ట్' ప్రకటించింది. తుఫాను కారణంగా ప్రచండ గాలులు వీస్తాయని, గాలి వేగం గంటకు 160-185 కి.మీ.కు పెరుగుతుందని తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. సోమవారం మహారాష్ట్ర తీర ప్రాంతంలో గాలి వేగం గంటకు 65-75 కి.మీ.; దుమారం వేగం గంటకు 85 కి.మీ. ఉంటుందని పేర్కొంది.

లాక్‌డౌన్, కరోనా నిబంధన అమలులో పోలీసుల పనితీరు భేష్ : హైకోర్టు

హైదరాబాద్ , మే 17: రాష్ట్రంలో లాక్‌డౌన్, కరోనా నిబంధనల అమలు తీరులో పోలీసుల పనితీరు భేషుగ్గా ఉందని హైకోర్టు ప్రశంసించింది. భవిష్యత్‌లోనూ ఇదే రీతిలో పనిచేయాలని సూచించింది. తెలంగాణలో లాక్‌డౌన్, రాత్రి కర్ఫ్యూ, కరోనా నిబంధనల అమలు తీరుపై హైకోర్టు ఇవాళ విచారణ జరిపింది. విచారణకు హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ సీపీలు హాజరయ్యారు. లాక్‌డౌన్, కరోనా నిబంధనల అమలు తీరుపై డీజీపీ కోర్టుకు నివేదిక సమర్పించారు.

"ఔషధాల బ్లాక్ మార్కెట్‌పై 98 కేసులు నమోదు చేశాం. ప్రభుత్వ దవాఖాన వద్ద 57 సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఈ నెల 1 నుంచి 14 వరకు 4,31,823 కేసులు నమోదు చేశాం. మాస్కులు లేని వారిపై 3,39,412 కేసులు నమోదు చేసి రూ. 31 కోట్ల జరిమానా విధించాం. భౌతికదూరం పాటించనందుకు 22,560 కేసులు నమోదు చేశాం. కర్ఫ్యూ నిబంధనల ఉల్లంఘనపై 26,082 కేసులు పెట్టాం" అని డీజీపీ వెల్లడించారు. రాష్ట్రంలో లాక్‌డౌన్, రాత్రి కర్ఫ్యూ అమలు తీరుపై హైకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. మూడు కమిషనరేట్ల పరిధిలోని పోలీసుల పనితీరును అభినంద ించింది.

వాక్సినేషన్ డ్రైవ్‌ను ప్రభుత్వం ఎందుకు నిర్వహించలేదు: హైకోర్టు

హైదరాబాద్ , మే 17: ఇతర రాష్ట్రాల్లో వ్యక్సినేషన్ డ్రైవ్ లాగ తెలంగాణలో ఎందుకు నిర్వహించలేదని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కరోనా పరిస్థితులపై తెలంగాణ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. వ్యాక్సినేషన్ ఇచ్చే విషయంలో తెలంగాణ 15వ స్థానంలో ఉందన్న పిటిషనర్లు తెలిపారు. మొదటి దశలో ప్రైవేట్ హాస్పిటల్ చార్జీలపై ఫిర్యాదులకు ముగ్గురు ఐఏఎస్‌లతో కూడిన టాస్క్ ఫోర్స్ కమిటీ వేశారని చెప్పారు. కానీ ఇప్పుడు ఇంత ఇంటెన్సిటీ ఉన్నా ఆ కమిటీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పిటిషనర్లు ఆరోపించారు. ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స లు సిటిస్కాన్ ఇతర టెస్టులకు ధరలు నిర్ణయించాలని హైకోర్టు ఆదేశించింది. గతంలో ఇచ్చిన జీవో ఇప్పుడు సరిపోదని, కొత్తగా ధరలపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రైవేట్ హాస్పిటల్లో అక్రమాలపై ముగ్గురు సభ్యుల కమిటీని నియమించాలని హైకోర్టు పేర్కొంది.

తెలంగాణలో మూడు రోజుల్లో వానలు

హైదరాబాద్ , మే 17: తౌటే తుపాను ప్రభావంతో తెలంగాణలో దక్షిణ దిశ నుంచి బలమైన గాలులు వీస్తున్నాయి. రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం రోజు ఒకట్రెండు చోట్ల 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. తౌటే తుపాను ప్రభావం రాష్ట్రానికి అంతగా లేకపోయినప్పటికీ దక్షిణ దిశగా వీస్తున్న బలమైన గాలుల కారణంగా కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

జూన్ తొలివారంలో దేశవ్యాప్తంగా అందుబాటులోకి 2-డీజీ డ్రగ్

న్యూఢిల్లీ, మే 17: డీఆర్డీఓ అభివృద్ధి చేసిన యాంటీ కొవిడ్ డ్రగ్ 2-డీజీ జూన్ తొలివారంలో దేశవ్యాప్తంగా అన్ని దవాఖానల్లో అందుబాటులో ఉంటుందని డీఆర్డీఓ చైర్మన్ జీ సతీష్ రెడ్డి వెల్లడించారు. తొలి బ్యాచ్ డ్రగ్ లాంఛనంగా సోమవారం ప్రారంభం కాగా ప్రస్తుతం ఎయిమ్స్, సాయుధ దళాల ఆస్పత్రులు, డీఆర్డీఓ ఆస్పత్రులతో పాటు అవసరమైన ఆస్పత్రుల్లో వాడతారని చెప్పారు.

జూన్ నుంచి దేశవ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో 2-డీజీ మందు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఈ ఔషధం ఉత్పత్తి సాగుతోందని మే చివరివారంలో రెండో బ్యాచ్ సిద్ధమవుతుందని అన్నారు. జూన్ తొలి వారం నుంచి రెగ్యులర్ ప్రొడక్షన్ ఊపందుకుంటుందని వెల్లడించారు.

డీసీజీఐ నుంచి డ్రగ్ కు అనుమతి లభించినప్పటి నుంచి పరిశ్రమ సహకారంతో ఉత్పత్తిని పెంచేందుకు శ్రమించినా సాధారణ ఉత్పత్తి సామర్థ్యం చేరుకునేందుకు నెలరోజుల సమయం పడుతుందని చెప్పారు.

2-డీజీ మందు పనితీరును వివరిస్తూ శరీరంలో కొవిడ్-19 వైరస్ దాగిన కణాల్లోకి నేరుగా ఈ మందు వెళ్లి వైరస్ వ్యాప్తిని ఇతర ఆరోగ్యంగా ఉన్న కణాల్లోకి చేరకుండా నిరోధిస్తుందని చెప్పారు. రోగిలో వ్యాధి నిరోధక శక్తిపై కూడా ఈ మందు పనిచేయడంతో రోగి త్వరగా కోలుకునేందుకు ఉపకరిస్తుందని వివరించారు.

సికింద్రాబాద్ ఆర్మీ హాస్పిటల్‌కు ఎంపీ రఘు రామకృష్ణ రాజు

న్యూఢిల్లీ, మే 17: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించారనే ఆరోపణలతో సర్పావురం ఎంపీ రఘురామ కృష్ణరాజును ఆ రాష్ట్ర సీఐడీ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే వైఎస్ఆర్ పార్టీ రెబల్ ఎంపీ రఘు రామకృష్ణరాజుకు సికింద్రాబాద్‌లోని ఆర్మీ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఇవాళ సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. దేశద్రోహం కేసులో అరెస్టు అయిన రామకృష్ణ రాజును తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఆర్మీ హాస్పిటల్‌లోనే చికిత్స అందించాలంటూ సుప్రీం తన ఆదేశాల్లో స్పష్టం చేసింది.

తెలంగాణ హైకోర్టు అపాయింట్ చేసిన జ్యుడిషియల్ ఆఫీసర్ సమక్షంలో ఎంపీ రఘుకు వైద్య పరీక్షలు నిర్వహించాలని కోర్టు ఆదేశించి ంది. కృష్ణరాజుకు నిర్వహించే మెడికల్ ఎగ్జామినేషన్ మొత్తాన్ని వీడియో తీయాలని, ఆ నివేదికను సీల్డు కవరులో తమకు పంపాలని కోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది.గత శుక్రవారం మధ్యాహ్నం ఎంపీ రఘు రామకృష్ణరాజును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అరెస్ట్‌చేసి ఏపీకి తరలించారు.

ఆయనపై 124ఏ, 153ఏ, 505 సెక్షన్ల కింద కేసులు నమోదుచేసినట్టు ఏపీ సీఐడీ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇరు వర్గాలు, కులాల మధ్య చిచ్చుపెట్టేలా రఘురామ కృష్ణరాజు వ్యాఖ్యలు చేశారని, ప్రభుత్వ పదవుల్లో ఉన్న వ్యక్తులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆయనపై అభియోగం మోపారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, న్యూస్ చానళ్లు వ్యవహరించారని ఎంపీ రఘుపై కేసు నమోదుచేశారు.

ముంబైలో గాలివాన బీభత్సం..
కూలిన చెట్లు, కరెంటు స్తంభాలు

ముంబై, మే 17: ముంబైలో భారీ వర్షాలు, బలమైన ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. అరేబియా సముద్రంలో ఏర్పడిన తౌటే తుఫాన్ ప్రభావంతో ముంబై నగరం అతలాకుతలం అవుతున్నది.

పలుచోట్ల వృక్షాలు కూలిపోయాయి. కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. శివసేన భవన్ సమీపంలో కూడా గాలివాన ధాటికి కరెంటు స్తంభం విరిగిపడింది.

పలు చెట్లు కూలిపోయాయి. దాంతో ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపడుతున్నారు.

చరిత్రలో నేటినిజం

తే॥ చదువరుల సుస్వాగతంబుల
చదువనమపై తెలంగాణ చరిత్రనంబుజేరి
పొడవరి శ్రీ.వి.చలమ్‌కు
శిరసువులపు చుంబి నేను జుమ్మనినమునన్!!

-రాధశ్రీ

(మే 18 హోళ్ళనుడు శ్రీ.వి. చలం పుట్టినరోజు...)

సెల్: 9494481210

ఓఎన్‌జీసీ కీలక నిర్ణయం : లక్ష ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల సమీకరణ!

న్యూఢిల్లీ, మే 17: : కరోనా సెకండ్ వేవ్ వ్యాప్తితో ఆక్సిజన్ కొరత వెంటాడటంతో దేశానికి బాసటగా నిలిచేందుకు చమురు సహజ వాయు కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) ముందుకొచ్చింది. గ్లోబల్ సప్లయి చైన్, లాజిస్టిక్స్ లో తన సామర్థ్యాలను ఉపయోగించి కేంద్ర ప్రభుత్వం తరపున లక్ష ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను సమీకరించాలని ఓఎన్‌జీసీ నిర్ణయించింది. ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. ఓఎన్‌జీసీ నిర్ణయంతో దేశాన్ని వెంటాడుతున్న మెడికల్ ఆక్సిజన్ కొరతను కొంతమేర అధిగమించవచ్చు.తక్షణ సరఫరాల కోసం ఓఎన్‌జీసీ ఇప్పటికే 34,673 ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల కోసం విదేశీ కంపెనీలకు ఆర్డర్ ఇచ్చింది. వీటిలో 2900 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు ఈనెల 21కి భారత్ కు చేరుకుంటాయని ఓఎన్‌జీసీ ట్వీట్ చేసింది. ఇక 40,000 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను దేశీ తయారీదారుల నుంచి సమీకరించనుంది. మరోవైపు మూడు రాష్ట్రాల్లోని పది ప్రభుత్వ దవాఖానల్లో ఓఎన్‌జీసీ సహకారంతో మూడు ఆక్సిజన్ తయారీ ప్లాంట్లను నెలకొల్పనున్నారు.

కోవిడ్ బాధితులకు ఉచిత భోజనం పంపిణీని ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్లు!!

సంగారెడ్డి, మే 17 (నేటినిజం ప్రతినిధి) సంగారెడ్డి మున్సిపాలిటీ లో కరోనా బాధితులకు ఇంటి వద్దకే ఉచిత భోజనం పంపిణీ కార్యక్రమం సోమవారం నుండి ప్రారంభమైంది.

కలెక్టరేట్లో సోమవారం ఉచిత ఆహార పంపిణీ సహాయ కేంద్రం వాహనాలను అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి లు జండా ఊపి ప్రారంభించారు.

భోజనం అవసరమున్న కోవిడ్ బాధితులు ఎలాంటి సందేహాలు లేకుండా సహాయ కేంద్రం ఫోన్ నెంబర్ 7207488745 కు ఫోన్ చేసి తమ పేరు నమోదు చేసుకోవాలని రాజార్షి సూచించారు. వారికి నేరుగా ఇంటి వద్దనే భోజనం ప్యాకెట్లను అందిస్తారని తెలిపారు.

అట్టి వాహనాలలో మున్సిపల్ సిబ్బంది రూట్ మ్యాప్ తో పట్టణంలోని ఆయా ఏరియాలకు వెళ్లి కోవిడ్ బాధిత కుటుంబాలకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఇంటి వరకు వెళ్లిన వాహనం వద్దకు సంబంధిత బాధితుల అటెండెంట్స్ వచ్చి భోజనం ప్యాకెట్లను తీసుకున్నారు.

అదేవిధంగా మంజీరా, కె బి ఆర్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న కోవిడ్ బాధితులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు.

సంబంధితులు ఐసోలేషన్ లో ఉన్నన్ని రోజులు పౌష్టికాహారంతో కూడిన ఉచిత భోజనం అందిస్తారని రాజార్షీ తెలిపారు. ఈరోజు సుమారు రెండు వందల భోజనం ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇట్టి అవకాశాన్ని సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని కోవిడ్ బాధితులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ రాధిక రమణి, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి కేషురాం, తదితరులు పాల్గొన్నారు.

కరోనా ఆపత్కాలంలో ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ విరాళం..!!

- న్యూ లాండ్ లాబొరేటరీస్ యాజమాన్యం (30) ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్.

- కోకా కోలా కంపెనీ వారు (05) ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ .

-అందజేసిన విరరాళ్లు వెల్లడించిన జిల్లా అదనపు కలెక్టర్ రాజార్షి షా.

సంగారెడ్డి, మే17 (నేటినిజం ప్రతినిధి) సోమవారం ఆయన చాంబర్లో ఆయా ప్రతినిధులు ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ ను అందజేశారు. ఇట్టి ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ ను జిల్లా ఆసుపత్రి మరియు ఏరియా ఆస్పత్రులకు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

న్యూలాండ్స్ లాబొరేటరీస్ వారు రెండు వేలు ఎన్ - 95 మాస్కులు కూడా అందించారన్నారు. జిల్లాకు తమ వంతు సహకారాన్ని అందించిన ఆయా యాజమాన్యాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్హెచ్ఓ గాయత్రి దేవి, డాక్టర్ శశాంక్ ,న్యూ లాండ్ లేబరేటరీస్ ప్రతినిధులు సుందర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీరామ్, డా. రవి ,రఘు, కోకా కోలా కంపెనీ ప్రతినిధులు,జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ వనజా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రైడెంట్ చక్కెర కర్మాగారం ఆస్తుల వేలం నిలిపివేత...! -జిల్లా కలెక్టర్ హనుమంతరావు.

సంగారెడ్డి, మే 17 (నేటినిజం ప్రతినిధి) ఈనెల 18న (మంగళవారం) నిర్వహించవలసిన జహీరాబాద్ మండలం కొత్తూరు (బి) ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ ఆస్తుల బహిరంగ వేలాన్ని నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ చెల్లించాల్సిన చెరుకు బకాయలు రూ. 11,50,36,325/- లు ఈనెల 15న చెల్లించినందున ఆస్తుల వేలం నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

కరోనా నుంచి కాపాడుకుంటాం

ప్రజలకు అండగా ప్రభుత్వం

ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు నిరంతరం శ్రమిస్తున్నారు

గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, మే 17: : కరోనా మహమ్మారి నుంచి ప్రజలను కాపాడుకుంటామని, ప్రభుత్వం అండగా ఉంటుందని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. ఆదివారం ఉదయం ఆమె జిల్లాకేంద్రంలోని డాక్టర్స్ వీధి, కూరగాయల మార్కెట్, నెహ్రూ సెంటర్, ఇందిరాగాంధీ సెంటర్తోపాటు ప్రధాన కూడళ్లలో ఎమ్మెల్యే శంకర్నాయక్తో కలిసి పర్యటించారు. కరోనా కట్టడిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ..ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు సమన్వయంతో కరోనా రోగులకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. లాక్డౌన్ వెలుసుబాటు ఉన్న సమయం లో అత్యవసరమైతేనే బయటకు రావాలని, వచ్చి న పని చూసుకుని త్వరగా ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు శుభకార్యాలకు వెళ్లకపోవడమే మం చిదన్నారు. జిల్లా అభివృద్ధికి సీఎం కేసీఆర్ అడగ్గానే నిధులిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే శంకర్నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్రెడ్డి మానుకోటను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందు కు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పూర్తయితే వ్యాపారులు రోడ్లపై కూరగాయల అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేందర్రెడ్డి, ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, తేళ్ల శ్రీను, రఘు పాల్గొన్నారు.

నేడు గార్లలో ఆక్సిజన్ బెడ్లు ప్రారంభం

గార్ల, మే 16 : పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం మండలంలో 30 పడకల దవాఖానను నిర్మించింది. కరోనా కేసులు పెరుగుతుండడంతో దవాఖానలోని పై అంతస్తులో యుద్ధ ప్రాతిపదిక 20 ఆక్సిజన్ బెడ్లను సిద్ధం చేశారు. సోమవారం వాటిని మంత్రి సత్యవతి రాథోడ్ ప్రారంభించనున్నట్లు టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాధాకృష్ణ తెలిపారు.

హెచ్ఐవి ఏయిడ్స్' ప్రాణాంతకం - టీకాతోనే అంతం...!

(18 మే 'ప్రపంచ ఏయిడ్స్ వ్యాక్సీన్ దినం' సందర్భంగా)

కోవిడ్-19 మహా విపత్తుతో పాటు విశ్వసమాజాన్ని వణికిస్తున్న ముఖ్య ప్రాణాంతక వ్యాధుల్లో హెచ్ఐవి-ఏయిడ్స్, ఎబోలా మరియు క్యాన్సర్ ముందు వరుసలో ఉన్నాయి. 'హూమన్ ఇమ్యునో వైరస్ (హెచ్ఐవి)' సోకడం ద్వారా వ్యాపించే వ్యాధిని 'అర్జిత వ్యాధినిరోధశక్తి లోప కారణ బహువ్యాధి లక్షణం (అక్వేర్డ్ ఇమ్యునో డెఫిసియెన్సీ సిండ్రోమ్, ఏయిడ్స్' అని పిలుస్తారు. ప్రపంచవ్యాప్తంగా 38 మిలియన్ల హెచ్ఐవి-ఏయిడ్స్ సోకిన బాధితులు ఉన్నారని, 2019లోనే 1.7 మిలియన్ల మందికి సోకిందని గణాంకాలు తెలుపుతున్నాయి. నేటికీ ఏయిడ్స్‌ను శాశ్వతంగా కట్టడి చేయగల ఎలాంటి టీకా అందుబాటులో లేకపోయినా, వైద్య ఆరోగ్య మరియు శాస్త్రసాంకేతిక సమాజం ఏయిడ్స్ టీకాను రూపొందించే తీవ్ర పరిశోధనల్లో మునిగి ఉంది. ఏయిడ్స్ వ్యాధి, హెచ్ఐవి నివారణ పట్ల సంపూర్ణ అవగాహన మరియు ఏయిడ్స్ రోగులకు చేయూత నిచ్చే సేవామూర్తులను అభినందించడంతో పాటు వ్యాక్సీన్ రూపొందించే శాస్త్రజ్ఞుల ప్రయత్నాల పట్ల ప్రపంచ మానవాళికి అవగాహన కల్పించడం కోసం ప్రతి ఏటా 18 మే రోజున 'ప్రపంచ ఏయిడ్స్ టీకా అవగాహన దినం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది.

18 మే 1997 రోజున అమెరికాలోని మోర్గాన్ స్టేట్ యూనివర్సిటీ సమావేశంలో పాల్గొన్న నాటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ మాట్లాడుతూ, ఏయిడ్స్ వ్యాధిని రూపుమాపగల వ్యాక్సీన్‌ను రూపొందించాలని శాస్త్రజ్ఞులను విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన సమాజం ప్రతి ఏటా 18 మే 1998 రోజున ప్రపంచ ఏయిడ్స్ టీకా దినం జరుపుకోవడం ప్రారంభించారు. అరక్షిత అక్రమ లైంగిక సంబంధాలు, రోగి రక్తం ఆరోగ్యవంతుల రక్తంలో కలవడం మరియు తల్లి నుంచి శిశువుకు హెచ్ఐవి సోకే ప్రమాదం ఉందని మనకు తెలుసు. ఏయిడ్స్‌ను నిలువరించ ఔషధాలు అందుబాటులో లేవు, కావున హెచ్ఐవి-ఏయిడ్స్‌కు ఏకైక ఔషధం టీకా మాత్రమే అని ప్రపంచ మానవాళి నమ్ముతున్నది. ప్రపంచ ఏయిడ్స్ టీకా దినం వేదికగా స్వచ్ఛంధ కార్యకర్తలు, సంఘ సేవకులు, ఆరోగ్య సిబ్బంది మరియు టీకా రూపొందించే యజ్ఞంలో అవిశ్రాంత కృషి చేస్తున్న శాస్త్రసాంకేతిక నిపుణులను గుర్తించి, కృతజ్ఞతలను తెలియజేయడం జరుగుతుంది. రాబోయే రోజుల్లో సురక్షిత, ప్రభావశీల హెచ్ఐవి-ఏయిడ్స్ టీకా అందుబాటులోకి వస్తోందని పరిశోధనా ఫలితాలు తెలియజేస్తున్నాయి.

హెచ్ఐవి-ఏయిడ్స్ టీకా పరిశోధనల పురోగతి:

హెచ్ఐవి వైరస్ అతి వేగంగా పరివర్తనం చెందే స్వభావం కారణంగా టీకా అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఫిబ్రవరి 2021లో న్యూయార్క్ 'ఐఏవిఐ - స్క్రిప్స్ రీసెర్చి ఇనిస్టిట్యూట్' చేస్తున్న పరిశోధనల్లో ఏయిడ్స్ వ్యాక్సీన్ అభివృద్ధి ప్రయత్నాలలో కొంత పురోగతి సాధించడం సంతోషించదగిన పరిణామం. కరోనా వైరస్‌కు టీకా రూపొందించిన మోడెర్నా ఫైజర్ కంపెనీలు వ్యాక్సీన్ కోసం ఎంచుకున్న యం-ఆర్ఎన్ఏ ప్రక్రియను అనుసరించి హెచ్ఐవి-ఏయిడ్స్ టీకాను రూపొందించే పరిశోధనలు సత్ఫలితాలను ఇస్తున్నది. ఈ పద్ధతిలో హెచ్ఐవి టీకా రూపొందితే, ఇదే పద్ధతిలో డెంగ్యూ, ఇన్‌ఫ్లుయెంజా, జికా, హెపటైటిస్-సి, మలేరియా లాంటి వ్యాధుల కట్టడికి టీకాలను రూపొందించడానికి మార్గం సుగమం అవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఐవి-ఏయిడ్స్ మ్యుటేటింగ్ టీకాలతో యాంటీబాడీలను ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగిన రోగనిరోధక కణాల తయారీని ఉత్తేజ పరిచడంలో 'జర్మ్‌లైన్ టార్గెటింగ్' ప్రక్రియలో సఫలీకృతం కావడం విశేషం. ఈ పరిశోధనల్లో తొలి దశ క్లినికల్ ట్రయల్స్-1లో 48 మంది పాల్గొనగా, అందులో 47 మందికి ఆశించిన ఫలితాలు కనిపించాయి. ఇదే క్రమంలో ఫేజ్-మరియు ఫైనల్ ట్రయల్స్ సత్ఫలితాలను ఇచ్చిన యెడల హెచ్ఐవి-ఏయిడ్స్ టీకా రావడానికి మరెంతో సమయం పట్టదని తెలుస్తున్నది. ఈ మహాయజ్ఞంలో శాస్త్రజ్ఞులు విజయవంతం కావాలని, ఏయిడ్స్ రహిత ప్రపంచ సమాజాన్ని నిర్మించాలని, 'ఐఏవిఐ-స్క్రిప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్'కు ముందస్తు శుభాకాంక్షలు తెలుపుదాం. హెచ్ఐవి-ఏయిడ్స్ గూర్చి తెలుసుకుందాం, వైరస్ వ్యాప్తిని నివారిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఆంధ్రప్రదేశ్‌లో రెండు ప్రధాన ఆక్సిజన్ ప్లాంట్లకు మరమ్మతులు చేసిన నౌకాదళ బృందం

న్యూఢిల్లీ, మే 17: ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, శ్రీకాళహస్తిలో ఉన్న రెండు ప్రధాన ఆక్సిజన్ ప్లాంట్లకు విశాఖలోని నౌకాదళ బృందాలు మరమ్మతులు చేశాయి. దీనివల్ల, ప్రస్తుత ఆక్సిజన్ సంక్షోభ సమయంలో రాష్ట్రంలో ఆక్సిజన్ సరఫరాకు గొప్ప ఊతం దొరికింది.

రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు, విశాఖ నావల్ డాక్‌యార్డు నుంచి నిపుణుల బృందాలను డోర్నియర్ విమానాల ద్వారా తూర్పు నౌకాదళం క్షేత్రస్థాయికి పంపింది. ఈ ఉదయం, నిపుణుల బృందాలు కంప్రెషర్లను సరిచేసి, ఆక్సిజన్ ప్లాంట్లకు విజయవంతంగా మరమ్మతులు పూర్తి చేశాయి. నావల్ డాక్‌యార్డ్‌లో తయారైన అడాప్టర్లు, మరికొన్ని ఉపకరణాలను ప్లాంట్లలో అమర్చాయి.

నెల్లూరులోని కృష్ణతేజ ఆక్సిజన్ ప్లాంటు అతి పెద్ద క్రయోజెనిక్ ప్లాంటు. ఇది, 400 అతి భారీ సిలిండర్లను ఒక్కరోజులో నింపగలదు. గత ఆరేళ్లుగా పనిచేయడం లేదు. నౌకాదళ నిపుణులు విజయవంతంగా పనిపూర్తి చేసి, -186 డిగ్రీల క్రయోజెనిక్ ఉష్ణోగ్రత ఉండేలా చేయగలిగారు. సిలిండర్లను నింపేందుకు అవసరమైన ఆక్సిజన్ ఒత్తిడి కూడా ఉండేలా విజయం సాధించారు. ఇక్కడ ఉత్పత్తయ్యే 98% ఆక్సిజన్, 0% కార్బన్ మోనాక్సైడ్, 0.01% కార్బన్ డై ఆక్సైడ్ కలిసిన విశ్లేషణ, రాష్ట్రంలో వైద్య ఆక్సిజన్ కొరతను భర్తీ చేస్తుంది.

శ్రీకాళహస్తిలోని ఆక్సిజన్ ప్లాంటు వీపీఎస్ఏ సాంకేతికతతో నిర్మితమైంది. ఇది, నిమిషానికి 16 వేల లీటర్ల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేయగలదు. దీనిని నౌకాదళ బృందం విజయవంతంగా మరమ్మతు చేసింది. ఇక్కడి నుంచి 93%పైగా ఆక్సిజన్, 0% కార్బన్ మోనాక్సైడ్, 0.01% కార్బన్ డై ఆక్సైడ్ కలిసిన ఆక్సిజన్ ఉత్పత్తి అవుతుంది. ఈ ప్లాంటు కాలమ్, తేమ శోషణను మరమ్మతు చేయడం ద్వారా నిపుణుల బృందం ఈ విజయాన్ని సాధించింది.

కమాండర్ దీపాయన్ నేతృత్వంలోని నౌకాదళ బృందం అవిశ్రాంతంగా 7 రోజులపాటు కష్టపడి ఈ రెండు ప్లాంట్లకు మరమ్మతులు పూర్తి చేసింది. ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య విభాగం, జిల్లా కలెక్టర్లు, జిల్లా యంత్రాంగాలు వీరికి సహకరించాయి

భారత ప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చిన ఉచిత టీకా డోసులు 20 కోట్లు

న్యూఢిల్లీ, మే 17: కోవిడ్ మీద పోరులో భాగంగా భారత ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యాధి నిర్ధారణ పరీక్షలు, సోకినవారీ ఆచూకీ కనిపెట్టటం, తగిన చికిత్స అందించటం, వ్యాప్తి నివారణకు తగిన జాగ్రత్తలు పాటింపజేయటం, టీకాలివ్వటం అనే ఐదు అంశాల ప్రాధాన్యంలో భాగంగా టీకాల మీద ప్రత్యేక దృష్టిసారించింది. భారత ప్రభుత్వం దేశవ్యాప్త టీకాల కార్యక్రమానికి అండగా ఉండి రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు టీకా డోసులు ఉచితంగా అందిస్తూ వచ్చింది. అంతే కాకుండా ఉత్పత్తి, సరఫరాను పెంచటానికి అనేక చర్యలు తీసుకుంటోంది.

మూడో దశ టీకాల కార్యక్రమాని మరింత సరళంగా, వేగంగా అమలు చేయటం మే 1న మొదలైంది. ఈ వ్యూహంలో భాగంగా ప్రతి నెలలో సెంట్రల్ డ్రగ్స్ లేబరేటరీ ఆమోదించిన ఉత్పత్తి సంస్థలలో తయారైన 50% టీకా మందును కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రాష్ట్రాలు మిగిలిన 50% నుంచి కొనుగోలు చేసుకోవచ్చు. ప్రభుత్వం అందించే టీకామందు మునుపటిలాగానే రాష్ట్రాలకు ఉచితంగా పంపిణీ జరుగుతుంది.

భారత ప్రభుత్వం ఇప్పటిదాకా రాష్ట్రాలకు, కేంద్రపాలితప్రాంతాలకు దాదాపు 20 కోట్లకు పైగా (20,28,09,250) కోవిడ్ డోసులు ఉచితంగా అందజేసింది. ఇందులో రాష్ట్రాల వాడకం, వృధా కలిపి 14వ తేదీ వరకు 18,43,67,772 డోసులు ఉన్నట్టు ఈ ఉదయం 7 గంటల వరకు అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

రాష్ట్రాల దగ్గర ఇంకా 1.84 కోట్లకు పైగా (1,84,41,478) టీకా డోసులు పంపిణీకి అందుబాటులో ఉన్నాయి. కొన్ని చోట్ల లోటు కనబడుతున్నప్పటికీ అది ఎక్కువ వాడకం లేదా వృధాను చూపుతోంది. సాయుధ దళాలకిచ్చిన టీకాల సంఖ్యను సమన్వయం చేసుకోకపోవటం కూడా కనిపించింది.

గత 6 రోజుల్లో 5 రోజులు కొత్త కేసుల కంటే కోలుకున్నవారు అధికం

న్యూఢిల్లీ, మే 17: భారత దేశంలో ఇప్పటిదాకా కరోనా నుంచి కోలుకొని బైటపడినవారి సంఖ్య 2,07,95,335 కు చేరింది. జాతీయ స్థాయిలో కోలుకున్నవారి శాతం 84.25% కాగా గత 24 గంటలలో 3,62,437 మంది కోలుకున్నారు. ఇది చికిత్సలో ఉన్నవారి కంటే ఎక్కువగా కాగా గత ఆరు రోజుల్లో ఇలా నమోదవటం ఇది ఐదో సారి. కోలుకున్నవారిలో 70.94% మంది పది రాష్ట్రాలలో ఉన్నారు.

మరోవైపు దేశంలో చికిత్సలో ఉన్న కోవిడ్ కేసుల సంఖ్య తగ్గుతూ నేడు 36,18,458 కు చేరింది. ఇది దేశం మొత్తంలో ఇప్పటిదాకా నమోదైన పాజిటివ్ కేసులలో 14.66%. గత 24 గంటలలో నికరంగా చికిత్సలో ఉన్నవారి సంఖ్యలో 55,344 కేసులు తగ్గాయి. చికిత్సలో ఉన్నవారిలో 74.69% వాటా పది రాష్ట్రాలదే కావటం గమనార్హం.

ఇప్పటిదాకా మొత్తం 26,55,003 శిబిరాల ద్వారా 18,22,20,164 టీకా డోసుల పంపిణీ జరిగినట్టు ఈ ఉదయం 7 గంటలకు అందిన సమాచారాన్నిబట్టి తెలుస్తోంది. ఇందులో ఆరోగ్య సిబ్బంది అందుకున్న 96,42,278 మొదటి డోసులు, 66,41,047 రెండో డోసులు, కోవిడ్ యోధులు అందుకున్న 1,44,25,044 మొదటి డోసులు, 81,86,568 రెండో డోసులు, 18-44 వయోవర్గం వారు అందుకున్న 48,25,799 మొదటి డోసులు, 45-60 ఏళ్లవారు తీసుకున్న 5,71,61,076 మొదటి డోసులు, 90,66,862 రెండో డోసులు, 60 ఏళ్ళు పైబడ్డవారు తీసుకున్న 5,44,69,599 మొదటి డోసులు, 1,78,01,891 రెండో డోసులు ఉన్నాయి.

18-44 వయోవర్గానికి చెందిన 5,62,130 మంది గత 24 గంటలలో కోవిడ్ టీకా మొదటి డోస్ తీసుకోగా ఇప్పటివరకు ఈ వయోవర్గంలో 48,25,799 మంది తీసుకున్నారు. 32 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెమ్దిన ఈ వయోఓవర్గపు లబ్ధిదారుల వివరాలు ఆయా రాష్ట్రాలవారీగా ఇలా ఉన్నాయి:

గడిచిన 24 గంటలలో 17 లక్షలకు పైగా టీకా డోసులిచ్చారు. దేశవ్యాప్తంగా టీకాల కార్యక్రమం మొదలైన 120వ రోజైన మే 15 నాడు 17,33,232 డోసుల పంపిణీ జరగగా 16,027 శిబిరాల ద్వారా 11,30,928 మంది మొదటి డోస్, 6,02,304 మంది రెండో డోస్ తీసుకున్నారు. గత 24 గంటలలో 3,11,170 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయి. వాటిలో పది రాష్ట్రాలవాటా 74.7% ఉంది. కర్నాటకలో అత్యధికంగా ఒక్క రోజులో 41,664 కొత్త కేసులు రాగా మహారాష్ట్రలో 34,848, తమిళనాడులో 33,658 నమోదయ్యాయి. జాతీయ స్థాయిలో కోవిడ్ బాధితులలో మరణాల శాతం 1.09% ఉంది. గత 24 గంటలలో 4,077 మంది కోవిడ్ వల్ల మరణించారు. అందులో పది రాష్ట్రాల వాటా 75.55% ఉంది. మహారాష్ట్రలో గత 24 గంటల్లో అత్యధికంగా 960 మంది చనిపోగా కర్నాటకలో 349 మరణాలు నమోదయ్యాయి. దీనికి తోడుగా విదేశాలనుంచి అందుతున్న కోవిడ్ సాయాన్ని వీలైనంత త్వరగా అందుకొని రాష్ట్రాలకు విభజించి తరలిస్తున్నారు. మొత్తం 10,953 ఆక్సిజెన్ కాన్సంట్రేటర్లు; 13,169 ఆక్సిజెన్ సిలిండర్లు; 19 ఆక్సిజెన్ ఉత్పత్తి ప్లాంట్లు; 6,835 వెంటిలేటర్లు; దాదాపు 4.9 లక్షల రెమిడిసివిర్ ఇంజెక్షన్లు ఇప్పటిదాకా రోడ్డు, వాయు మార్గాల్లో పంపారు.

శాంతి భద్రతలను కాపాడండి : బెంగాల్ గవర్నర్

కోల్‌కతా, మే 17: : నారద స్టింగ్ ఆపరేషన్ కేసులో ఇద్దరు బెంగాల్ మంత్రులను సీబీఐ అరెస్టు చేసింది. మంత్రులు ఫిర్‌హాద్ హకీమ్, సుబ్రతా ముఖర్జీలను సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో.. తృణమూల్ కార్యకర్తలు ఆగ్రహంతో ఊగిపోయారు.

కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయం ఎదుట టీఎంసీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు.

ఈ వ్యవహారంపై ఆ రాష్ట్ర గవర్నర్ జగదీప్ ధనఖర్ స్పందించారు. సీబీఐ కార్యాలయం ఎదుట టీఎంసీ కార్యకర్తలు ఆందోళనకు దిగడం, రాళ్ల దాడి చేయడం టీవీ చానెల్స్, ఇతర మాధ్యమాల ద్వారా చూశాను. కోల్‌కతా, బెంగాల్ పోలీసులు ఆందోళనకారులను అదుపు చేయకుండా, ప్రేక్షకపాత్ర వహించడంపై గవర్నర్ అసహనం వ్యక్తం చేశారు. శాంతి భద్రతలను కాపాడాలని గవర్నర్ పోలీసులకు సూచించారు.

ఈ కేసులో నలుగురు తృణమూల్ నేతలపై విచారణ చేపట్టేందుకు సీబీఐకి గవర్నర్ జగదీప్ ధనఖర్ అనుమతి ఇచ్చారు. స్పెషల్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసిన సీబీఐ.. ఆ తర్వాత వారిని కస్టడీలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఇటీవలే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి మూడోసారి సీఎం అయిన మమతా బెనర్జీ క్యాబినెట్‌లో ఫిర్‌హాద్, సుబ్రతా ముఖర్జీలు మంత్రులుగా ఉన్నారు.

కోవిడ్ సేవల్లో వాలంటీర్లకు ఆహ్వానం పలుకుతున్న

కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు

కరీంనగర్ మే 17 (నేటినిజం ప్రతినిధి): కోవిడ్ సేవల్లో వాలంటీర్ల సేవలను సద్వినియోగం చేసుకునేందుకు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు ఆహ్వానం పలుకుతున్నారు. గతంలో లాక్‌డౌన్ సందర్భంగా వాలంటీర్ల సేవలను పోలీసులు సద్వినియోగం చేసుకున్న విషయం విదితమే. తాజాగా తీసుకునే వాలంటీర్లలో గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యతనిచ్చే అవకాశాలున్నాయి. స్వచ్ఛందంగా పనిచేసేందుకు నూతనంగా ముందుకువచ్చే వారి వివరాలను పరిశీలించనున్నారు. ప్రధానంగా ఈ వాలంటీర్లు కూరగాయల మార్కెట్లు, షాపింగ్‌మాల్స్‌ల వద్ద ప్రజలు భౌతికదూరం పాటింపజేసేలా సేవలందిండం, కోవిడ్ నియమనిబంధనలపై అవగాహన కల్పించాలి. ఉదయం 07గంటల నుండి 10గంటల వరకు వీరి సేవలను సద్వినియోగం చేసుకోనున్నారు. మంగళవారం(నేటినుండి) వాలంటీర్ల సేవలందించనున్నారు. వాలంటీర్ల పర్యవేక్షణ భాధ్యతను కరీంనగర్ టౌన్ అడిషనల్ డిసిపి పి అశోక్‌నకు అప్పగించారు. కమిషనరేట్ ప్రాంతాల్లో కూడా వాలంటీర్ల సేవలను సద్వినియోగం చేసుకునే చర్యలు వేగవంతంగా తీసుకోవాలని వివిధస్థాయిలకు చెందిన పోలీసు అధికారులను పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆదేశించారు.

కోవిడ్ నియమనిబంధనలపై మైకుల ద్వారా ప్రచారం

కోవిడ్ నియమనిబంధనలపై అన్నివర్గాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు మైకుల ద్వారా పోలీసులు ప్రచారపర్వాన్ని కొనసాగిస్తున్నారు. సడలింపుల సమయాల్లో జనం జమకూడుతున్న మార్కెట్లు, షాపింగ్‌మాల్స్, ఇతర వ్యాపార,వాణిజ్య సంస్థలకు చెందిన ప్రాంతాల్లోనే కాకుండా ప్రతివాడల్లో ఈ ప్రచారపర్వాన్ని కొనసాగించనున్నారు. భౌతికదూరం పాటించకపోవడం, మాస్క్‌లు పెట్టుకున్నా అవిమూతికి మాత్రమే పరిమితమై ముక్కులు తెరుచుకుని ఉంటున్న విధానంపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నారు. మాస్క్‌లను పరిపూర్ణస్థాయిలో ధరిస్తేనే రక్షణ ఉంటుందనే విషయాన్ని అన్నివర్గాల ప్రజలు గుర్తించాలని కోరుతున్నారు. భౌతికదూరం పాటించకపోవడం, నిర్లక్ష్యంగా మాస్క్‌లను ధరించడం, అమల్లోఉన్న నిబంధనలకు ప్రజలు తిలోదకాలు ఇవ్వడంద్వారానే వైరస్ ఎక్కువగా వ్యాప్తిచెందే ప్రమాదం ఉందని చెప్పారు. వైద్యుల సలహాలు,సూచనలను పాటిస్తూ స్వీయనియంత్రణ చర్యలు తీసుకోవడం ద్వారానే ఈ వైరస్ వ్యాప్తి ఉధృతిని నియంత్రించవచ్చని స్పష్టం చేస్తున్నారు.

*1472*కేసుల నమోదు, *357*వాహనాలు సీజ్

లాక్‌డౌన్ నియమనిబంధనలు ఉల్లంఘించిన వారిపై కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసులు మంగళవారం ఉదయం వరకు 1472 కేసులను నమోదు చేశారు. ఇందులో మాస్క్‌లు ధరించనివి 703, భౌతికదూరం పాటించకపోవడం 209, ఎక్కువమొత్తంలో జమకూడిఉండటం 48, లాక్‌డౌన్ ఉల్లంఘనలకు సంబంధించి 488, ఇతర కేసులు 24 నమోదు చేశారు. అలాగే కమిషనరేట్ వ్యాప్తంగా లాక్‌డౌన్ అమల్లోఉన్న సమయాల్లో అనవసరంగా రోడ్లపైకి వచ్చిన 357వాహనాలను సీజ్‌చేశారు. లాక్‌డౌన్ ఉల్లంఘనలకు పాల్పడేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు.

అపోలో ఆస్పత్రుల్లో 'స్పుత్నిక్ వీ' టీకాల పంపిణీ

హైదరాబాద్ , మే 17: రష్యాకు చెందిన కరోనా వ్యాక్సిన్ స్పుత్నిక్-వీ రెండో విడత టీకాలు ఆదివారం నాడు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. మే 1న తొలి విడత కింద 1.50 లక్షల డోసులు రాగా, రెండో విడతలో భాగంగా ఆదివారం 60 వేల డోసులు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు చేరుకున్నాయి. ఈ టీకాల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా హైదరాబాద్, విశాఖ అపోలో ఆస్పత్రుల్లో చేపట్టనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ సీఈవో మాట్లాడుతూ.. స్పుత్నిక్-వీ వ్యాక్సిన్‌కు డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. మొదటి డోసుకు ఇవాళ ట్రయల్ రన్ ప్రారంభించామని తెలిపారు. ట్రయల్ రన్‌

కేయూ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

వరంగల్ మే 17: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఫిబ్రవరిలో నిర్వహించిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం యూనివర్సిటీ అధికారులు విడుదల చేశారు. ఫలితాలను లిలిలి.ఎజీఎజీబితిఎజీ.జీఇ.తినిలో చూసుకోవచ్చని సూచించారు. రీ వాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ ఫస్టియర్ రెండో సెమిస్టర్‌లో 76.11 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు. డిగ్రీ సెకండియర్ ఫస్ట్ సెమిస్టర్‌లో 85.71 శాతం, రెండో సెమిస్టర్‌లో 82.79 శాతం, డిగ్రీ మూడో సంవత్సరం సెకండ్ సెమిస్టర్‌లో 85.68 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు.

కరోనా కట్టడిలో కీలకంగా మారిన సర్వే

ఇప్పటికే 70 శాతం సర్వే పూర్తి
1.75 లక్షల మందికి మెడికల్ కిట్లు అందజేత
తెలంగాణ బాటలోనే కేంద్రం

హైదరాబాద్ , మే 17: కరోనా విలయతాండవం చేస్తున్న వేళ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి జ్వరసర్వే సత్ఫలితాలనిస్తోంది. ఈ జ్వరసర్వే కారణంగానే.. లక్షన్నరకు పైగా జ్వరపీడితులు, కరోనా లక్షణాలున్నవారిని గుర్తించినా.. ఇంటి స్థాయిలోనే దానిని కట్టడి చేసి కోలుకునే మార్గం చూపింది. ప్రతి ఇంటికీ వైద్యబృందాలను పంపితే.. అసలు లెక్క తేలుతుందని, ఇంటి స్థాయిలోనే కరోనా కట్టడి వీలవు తుందని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. లాక్‌డౌన్‌కు ముందే ఇంటింటి సర్వేకు ఆదేశించగా, విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఇప్పటికే 16 జిల్లాల్లో ఈ సర్వే ముగియగా, ఈ వారంలో మొత్తం అన్ని జిల్లాల్లో పూర్తయ్యే అవకాశముంది.

హైదరాబాద్, తెలంగాణలో చేపట్టిన ఇంటింటి సర్వే సత్ఫలితాలు ఇస్తుండడం, క్షేత్రస్థాయిలోనే కట్టడికి దోహదపడుతుండడంతో.. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తరహా ఇంటింటి సర్వే చేపట్టాలని ఆదేశించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ మదిలో పుట్టిన అనేక పథకాలు, ఆలోచనలు దేశవ్యాప్త అమలు గతంలో జరగ్గా.. ఇపుడు కరోనా మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేస్తున్న వేళ తెలంగాణ ఆలోచన దేశానికి ఉపయోగపడుతోంది. ఇంటింటి ఆరోగ్యసర్వే కారణంగా.. సకాలంలో వైద్య సేవలు అందు తుండడంతో మరణాల సంఖ్య గణనీయంగా తగ్గింది. కోలుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది.

27,171 బృందాలు

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో.. 1,02,16,079 ఇండ్లు ఉన్నాయి. ఇందులో ఇప్పటివరకు 72,10,088 ఇండ్లలో సర్వే పూర్త యింది. మొత్తం 16 జిల్లాల్లో సర్వే పూర్తికాగా, ఇంకా 30శాతం సర్వే చేయాల్సి ఉంది. ఈ వారంలో సర్వే పూర్తవుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 27,171 సర్వే బృం దాలు పనిచేస్తున్నాయి. ఇం దులో గ్రామపం చాయతీ లలో 22,011, జీహెచ్ ఎంసిలో 1,410, ఇతర మునిసిపాలిటీలలో 3,750 బృందాలు సర్వే నిర్వహిస్తు న్నాయి. మరో వారంలో ఈ సర్వే పూర్తికానుంది. స్వల్ప లక్షణా లున్న వారికి.. ఈ సర్వే కారణంగా అద్భుత ఉప యోగం జరుగుతుండగా, పరిస్థితి సీరియస్‌గా ఉన్నవారిని కూడా ఈ వైద్యబృందాలు గుర్తింది.. హటాహటిన ఆస్పత్రు లకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇంటింటి సర్వే కరోనా సమ యంలో.. సాహసమే కాగా, ప్రభుత్వ నిర్ణయం.. ఆరోగ్య బృందాల కృషి పల్లెల్లో.. ఇళ్ళల్లోనే కట్టడికి దోహదపడు తోంది. ప్రతి వేయి ఇండ్లకు ఒక టీమ్‌ను ఏర్పాటుచేయగా, సీఎం కేసీఆర్ ప్రణాళిక సత్ఫలితాలను ఇస్తోంది. పల్లెల్లో ఈ బృందాల పనితీరుపై ప్రజల్లోనూ హర్షం వ్యక్తమవుతోంది. పల్లెల్లో ఈ టీమ్‌లో గ్రామపంచాయతీ కార్యదర్శితో పాటు ఎఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు ఉండగా.. పట్టణాల్లో పంచాయతీ సిబ్బంది స్థానంలో మునిసిపల్ సిబ్బంది ఈ టీమ్‌లో ఉన్నారు. ఆరోగ్యబృందాల పనితీరు, ఆలోచన విప్లవాత్మకమని వైద్యరంగ నిపుణులు అంటున్నారు.

70శాతం సర్వే పూర్తి

గత పదిరోజులుగా ఇంటింటి ఆరోగ్యసర్వే జరుగుతుండగా ఇప్పటికి 70శాతం పూర్తయి ంది. 72లక్షల ఇండ్లలో సర్వే పూర్తి కాగా, ఇంకా గణాంకాల ప్రకారం 30 లక్షల కుటుంబాల సర్వే జరగాల్సి ఉంది. వారం రోజుల్లో ఈ సర్వే పూర్తి కానుంది. సర్వే సందర్భ ంగా ఇంట్లోని వ్యక్తులెవరి కైనా జ్వరం లేదా ఇతర లక్షణాలు గుర్తిస్తే అక్కడికక్కడే మెడికల్ కిట్లు అందజేస్తు న్నారు. ఇంటింటి సర్వే ద్వారా 1.75లక్షల మందికి ఈ మెడికల్ కిట్లు అందించగా, ఓపిల ద్వారా మరో 75వేల మందికి ఈ కిట్లు అందాయి. ఈ కిట్ల ద్వారా ప్రాథమిక స్థాయి లోనే.. వైద్యం అందుతుండగా, ఇంటింటి సర్వేలో ఆరోగ్య బృందాలు కేసు తీవ్రతను బట్టి చికిత్స అందిస్తున్నాయి. సూచనలు చేస్తున్నాయి. సకాలంలో విలువైన ప్రాణాలు కాపాడబడుతు న్నాయి.

ఈ ఇంటింటి సర్వే జరగకుంటే.. తెలంగాణలో ప్రస్తుతము న్న వైద్య వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి లోనయ్యేది. మరణాల రేటు తీవ్రంగా ఉండేది. సమస్యను మూలాల్లోంచి ఆలోచించే సీఎం కేసీఆర్.. కరోనా నేపథ్యంలో ఇంటినుండే ప్రారం భించిన చికిత్స ప్రాథమిక స్థాయిలో కట్టడికి కారణ మవుతోంది.

వచ్చే నెల ప్రభుత్వ ఉద్యోగులకు పాత వేతనాలే..

హైదరాబాద్ , మే 17: కరోనా తీవ్రతతో పొంచి ఉన్న ముప్పు, లాక్‌డౌన్‌తో రాబ డికి చిక్కులతో సర్కార్ అతలాకులతం అవుతుం డగా, వచ్చే నెల నుంచి వేతనాలు, పింఛన్లు మరింత భారం కానున్నా యి. తెలంగాణ తొలి పీఆర్సీ నివేదిక ఆధా రంగా ప్రభుత్వం ఫిట్‌మె ంట్‌ను 30 శాతంగా ప్రక టించిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటికే ప్రభుత్వ వేతనాలు, పింఛన్లు మొత్తం రెవెన్యూ వ్యయంలో 36.16 శాతానికి చ???రడంతో ఫిట్‌మెంట్ అమలు మరింత భారం కానుంది. అసలే అంతంత మాత్రంగా ఉన్న పన్నుల ఆదాయంలో వైద్యరంగానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యతనిస్తోంది. ఈ నెలాఖరు వరకు లాక్‌డౌన్‌ను పొడిగించే అవకాశాలే ఎక్కువగా ఉన్నా యని అధికార వర్గాలు భావిస్తు న్నాయి. ఈ నేపథ్య ంలో జూన్ మొదటి వారంలో ఉద్యోగుల వేత నాలు, పింఛన్లు పాత పద్ధతిలోనే చెల్లింపులు జరగనున్నాయి. రెవెన్యూ పద్దుకింద ప్రభుత్వం చేస్తున్న ప్రధాన ఖర్చుల్లో వడ్డీ చెల్లింపులు, జీతాలు, వేతనాలు, పించన్లు, సబ్సిడీల వ్యయాల లెక్కలను ఆర్థిక శాఖ సిద్ధం చేస్తోంది. ఇందులో ఉద్యోగుల వేతనాల నిధులూ కేటా యిం చడం సహజంగానే జరుగుతుంది. యేటేటా ప్రభుత్వ ఉద్యో గుల వేతనాల భారం ప్రభుత్వంపై పెరుగుదల నమోదవుతోం దని, బడ్జెట్ అంచనాలకంటే గతేడాది ఈ వ్యయం 7 శాతం ఎక్కువగా నమో దైందని గుర్తించారు. మొత్తం రెవెన్యూ వ్యయ ంలో జీతాలపై ఖర్చు 36.16 శాతానికి చేరుకుంది. 2014-15లో వేతనాలు, జీతాల ఖర్చు రూ.12,200కోట్లుకాగా 2016-17 నాటికి రూ.21,897కోట్లకు చేరుకున్నది. ఇందులో ప్రణాళికేతర పద్దులో రూ. 20557కోట్ల, ప్రణా ళికా పద్దులో రూ.1340కోట్లుగా ఉన్నది. ఇక వడ్డీ చెల్లింపులకు 2014-15లో రూ.5227కోట్లు అవసరం కాగా 2016-17నాటికి రూ. 8609 కోట్లకు చేరుకున్నది. పించన్లు 2014-15లో రూ.4210 కోట్లు కాగా 2016-17లో రూ.9011 కోట్లుకు చేరింది. ఇక కీలకమైన సబ్సిడీలలో 2014-15లో రూ. 3587కోట్లుకాగా 2016-17కు రూ. 5935 కోట్లకు చేరాయి. మొత్తంగా 2014-15లో ఈ ఖర్చులు రూ. 25224 కోట్లు కాగా 2016-17కు రూ.45452కోట్లకు చేరుకుంది.

రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదార్లకు, ఇతర పదవీ విరమణ ప్రయోజ నాలకు 2016-17లో ఖర్చు చేసిన మొత్తం రూ.9011కోట్లు. ఇది రెవెన్యూ రాబడుల్లో 10.88శాతంగా నమోదైంది.

ంవెన్యూ వ్యయంలో 11.07శాతంగా ఉన్నది. బడ్జెట్ అంచనాలకంటే అధికం కావడంతో సహజంగానే కొంత భారం పడుతోంది. చెల్లింపులన్నీ నిలిపేసిన ఆర్థిక శాఖ ఉద్యోగులు, పించనర్లకు సకాలంలో వేతనాలు, పించన్లను అందజేస్తోంది.. ప్రతీనెల రూ. 12 వేల కోట్లుగా ఉండే రాబడి ఆదాయం ఈనెలలో ఇంకా రూ. 5వేల కోట్లకు కూడా చేరలేదు. బాండ్ల విక్రయాలు, రుణాలు, కేంద్ర పన్నుల వాటా నిధులు మినహా రాబడులేవీ పుంజుకులేదు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయాలేవి లేకపోగా పొదుపు చర్యలు తప్పనిసరిని ప్రభుత్వం భావిస్తోంది.

కాగా గతేడాది ఏప్రిల్‌లో వేతనాల్లో కోతనుంచి పోలీస్, వైద్య ఆరోగ్య శాఖల ఉద్యోగులకు మినహాయింపునిస్తూ సవరణ జీవో 28ని జారీ చేసింది. రాష్ట్రంలో మొత్తం 4,49,516 మంది ఉద్యోగులుం డగా, వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు 4,30,647కాగా, తాత్కాలిక ఉద్యోగులు 18,832 మంది ఉన్నారు.

పోలీస్ శాఖలో 54వేల మంది ఉద్యోగులుండగా, ఇందులో 397మంది తాత్కాలిక ఉద్యోగులున్నారు. హోంగార్డులను కూడా కలుపుకుని మొత్తం వేతనాలను కోతల్లేకుండా చెల్లించేందుకు సర్కార్ సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 4,49,516 మంది ఉద్యోగులు ఉండగా, 2.5లక్షల మంది పించన్‌దారులు న్నారు. వీరికి ప్రభుత్వం ప్రతీనెలా రూ. 3600కోట్లు వేతనాలు, పించన్లకు కేటాయిస్తోంది. గతేడాది మార్చిలో ప్రభుత్వం ఆరీ చేసిన జీవో 27లో పేర్కొన్న నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల వేతనాల్లో 75శాతం కోత పడ నుంది.

అఖిల భారత సర్వీస్ అధికా రుల వేతనాల్లో 60శాతం, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖల ఉద్యో గులు మినహా అన్ని రకాల ఉద్యోగుల వేత నాల్లో 50శాతం, నాల్గో తరగతి, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల్లో 10శా తం, పెన్షనర్ల పించన్లలో 10శాతం వేతనాల్లో కోత పెట్టింది.

వీటిని వేతనాల్లో కోతకు బదు లుగా వాయిదాగానే పరిగణించాలని ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఎపిడమిక్ డిసీజెస్ యాక్టు 1897 (సెక్షన్-2) ప్రకారం ఉద్యోగుల వేతనాల్లో కొంత భాగాన్ని వాయిదా వేస్తున్నట్లుగా జీవో 27 తర్వాత మరో సర్క్యులర్‌లో ఆర్థిక శాఖ స్పష్టతనిచ్చింది. కరోనా నేపథ్యంలో అత్యవసరాలకు, రాష్ట్ర ప్రజల వైద్య సేవలకు, ఇతర అత్యవసర కొను గోళ్లకు నగదు రిజర్వును ముందు జాగ్రత్తగా తమవద్ద పెట్టుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆ తర్వాత కోత పెట్టిన మొత్తాలను వేతనాలతో కలిపి అందజేసింది.

తౌక్టే తుఫానుపై క్యాబినెట్ సెక్రటరీ అధ్యక్షతన నేషనల్ క్రైసిస్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం

న్యూఢిల్లీ, మే 17: అరేబియా సముద్రంలో ఏర్పడ్డ తుఫాను తౌక్టే దృష్టిలో ఉంచుకుని జాతీయ విపత్తు నిర్వహణ కమిటీ (ఎన్‌సిఎంసి) సమావేశానికి కేబినెట్ కార్యదర్శి శ్రీ రాజీవ్ గౌబా అధ్యక్షత సమీక్షా సమావేశం నిర్వహించారు.

గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ మరియు తమిళనాడు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలు లక్షద్వీప్, దాద్రా డ నగర్ హవేలి మరియు డామన్ డదయ్యు నిర్వాహకులసలహాదారులతో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఈ సమావేశం జరిగింది. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల కార్యదర్శులు హాజరయ్యారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల సంసిద్ధతను సమీక్షించిన శ్రీ రాజీవ్ గౌబా..తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను తరలించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని, తద్వారా జీరో నష్టానికి పరిమితమయ్యేలాచూసుకోవాలని చెప్పారు. విద్యుత్, టెలికాం మరియు ఇతర ముఖ్యమైన సేవలను పునరుద్ధరించడానికి సన్నాహక ఏర్పాట్లు ఉండేలా చూడాలని సూచించారు. ఆస్పత్రులు మరియు కోవిడ్ కేర్ సెంటర్లపనితీరుకు అంతరాయం కలగకుండా, వాటికి క్రమం తప్పకుండా ఆక్సిజన్ సరఫరా చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని కేబినెట్ కార్యదర్శి ఉద్ఘాటించారు. దేశవ్యాప్తంగా కోవిడ్ సదుపాయాలకు ఆక్సిజన్ఉత్పత్తి మరియు సరఫరాను నిర్ధారించడంతో పాటు, ఆసుపత్రులు మరియు కోవిడ్ కేర్ సెంటర్ల నిరంతర పనితీరును నిర్ధారించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు. రాష్ట్ర పరిపాలనలకుఅవసరమైన సహాయం అందించేందుకు కేబినెట్ కార్యదర్శి సంబంధిత ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

తుఫానును ఎదుర్కోవటానికి చేపట్టిన సన్నాహక చర్యల గురించి సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు కమిటీకి వివరించారు. ఆహార ధాన్యాలు, తాగునీరు మరియు ఇతర నిత్యావసర సామాగ్రి తగినంతనిల్వలు ఏర్పాటు చేశామని అలాగే విద్యుత్, టెలికమ్యూనికేషన్స్ వంటి అవసరమైన సేవలను నిర్వహించడానికి సన్నాహాలు చేయబడ్డాయని తెలిపారు.

జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్) బాధిత రాష్ట్రాల్లో 79 టీములను మోహరించారని / అందుబాటులో ఉంచారని, 22 అదనపు జట్లు కూడా సంసిద్ధతలో ఉన్నాయని తెలిపారు. ఆర్మీ, నేవీమరియు కోస్ట్ గార్డ్ రెస్క్యూ మరియు రిలీఫ్ బృందాలతో పాటు ఓడలు మరియు విమానాలను కూడా అందుబాటులో ఉంచారు.

కోవిడ్ మహమ్మారిపై పోరాటంలో సమాజంతో చేతులు కలిపిన విద్యుత్ రంగ సిపిఎస్‌యులు

న్యూఢిల్లీ, మే 17: కోవిడ్ మహమ్మారిపై పోరాటం చేసేందుకు దేశవ్యాప్తంగా ఉన్నతమ ప్రతిఒక్క ఉద్యోగిని, పొరుగున ఉన్న సమాజాన్ని చేరుకునేందుకు బహుముఖ వ్యూహాలను విద్యుత్ మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న సిపిఎస్‌యులు (కేంద్రప్రభుత్వ నిర్వహణలో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలు) రూపొందిస్తున్నాయి.

అత్యంత ఒత్తిడిని ఎదుర్కొంటున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య సంరక్షణ మౌలిక నదుపాయాలపై రోగుల భారాన్ని తగ్గించేందుకు సిపిఎస్‌యులు కలిసి 200 ప్రాంతాలలో కోవిడ్ సంరక్షణ కేంద్రాలను, అత్యంత ఇన్ఫెక్షన్ రేటు ఉన్న ప్రాంతాలలో ఆక్సిజన్ సౌకర్యంతో కోవిడ్ కేర్ శిబిరాలను ఏర్పాటు చేశాయి. తమ స్వంత సిబ్బందితో పాటుగా కాంట్రాక్టు ఉద్యోగులు, వారి కుటుంబాలు, ఒక మాదిరిగా ఇన్ఫెక్షన్ సోకిన వ్యక్తులు వీటిని ఉపయోగించుకోవచ్చు.

దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లోని వివిధ ప్రాంతాలలో ఐసోలేషన్ కేంద్రాల ఏర్పాటు, మాస్కులు, శానిటైజర్ల పంపిణీ, ఆక్సిజన్ సౌకర్యంతో పడకలు, వాక్సినేషన్ శిబిరాల నిర్వహణ చేయడమే కాకుండా, సాధారణ పౌరుల కోసం ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు అందచేత, ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటు చేస్తూ తమ బాధ్యతను నిర్వరిస్తున్నాయి. పైన పేర్కొన్న పనులనే కాక, విద్యుత్ సిపిఎస్‌యులు పిఎం-కేర్స్ నిధికి రూ. 925 కోట్లను విరాళం ఇవ్వడం ద్వారా బలమైన మద్దతును ఇచ్చాయి.

ఉత్తర్ ప్రదేశ్‌లోని సిద్దార్థ నగర జిల్లా ఆసుపత్రిలో ఆక్సిజన్ ఉత్పత్తి చేసే ప్లాంటును ఏర్పాటు చేయడం కోసం సిద్దార్థనగర్ (యుపి) జిల్లా మేజిస్ట్రేట్‌కు రూ. 41.89 లక్షల రూపాయలను సిఎస్ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత)లో భాగంగా నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పిసి) అందిస్తోంది. అలాగే, ఉత్తర్ ప్రదేశ్లోని దియోరియా జిల్లా ఆసుపత్రిలోని కోవిడ్ కేందరానికి 60 ఆక్సిజన్ సిలెండర్ల కోసం సిఎస్ ఆర్ రూపంలో దియోరియా డిఎంకు రూ. 45 లక్షల రూపాయలను అందిస్తోంది.

సిఎస్ఆర్ కింద ఫరీదాబాద్‌లోని బాద్షా ఖాన్ (బి.కె.) జిల్లా ఆసుపత్రికి నిమిషానికి 1000 లీటర్లను ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగిన ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఎన్‌హెచ్‌పిసి ఏర్పాటు చేస్తోంది. ఇందుకు సంబంధించిన సేకరణ ప్రక్రియ ప్రారంభమైంది, త్వరలోనే ఖరారు కానుంది. ఎనిమిదది వారాలలో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు.

విద్యుత్ రంగ మరొక సిపిఎస్‌యు అయిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి), ఎన్‌సిఆర్‌లో బాట్లింగ్ సౌకర్యం ఉన్న రెండు పెద్ద ఆక్సిజన్ ప్లాంట్లు సహా, 11 ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్ల కోసం ఆర్డర్లను ఇచ్చాయి.

అంతేకాకుండా, సిఎస్ఆర్ కింద ఇతర రాష్ట్రాలలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులలో ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి తోడ్పాటును అందించడమే కాక, ఇతర రాష్ట్రాలలో ఎనిమిది భిన్న ప్రాంతాలలో ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది.

విద్యుత్ మంత్రిత్వ శాఖ మరొక భారీ సిపిఎస్‌యు అయిన ఆర్ఇసి లిమిటెడ్ (ఆర్ఇసిఎల్) తన సిఎస్ఆర్ అంగమైన-ఆర్ఇసి ఫౌండేషన్ పూణెలోని దాల్వా ఆసుపత్రిలో 150కెవి జనరేటర్ ప్లాంటును, నిమిషానికి 1700 లీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి చేసే సామర్థ్యం గల జనరేటర్ ప్లాంట్ (ఫుల్ అసెంబ్లీ)ను ఏర్పాటు చేసేందుకు రూ. 2.21 కోట్ల ఆర్థిక సహాయం అందించింది. మరొక సిఎస్ఆర్ చొరవలో భాగంగా, ఆర్ఇసి ఫౌండేషన్ ఉత్తరాఖండ్‌లోని ఉద్దంసింగ్ నగర్‌లో కోవిడ్ చికిత్సా కేంద్రంగా మార్చిన పండిత్ రామ్ సుమేర్ సుక్లా స్మృతి ప్రభుత్వ మెడికల్ కాలేజీకి మద్దతు అందించింది. ఈ కేంద్రం 36 పడకల ఐసియు వార్డు సహా 300 పడకలు, ఐసోలేషన్ కేంద్రం, పరీక్షా కేంద్రం తదితర సౌకర్యాలు ఇందులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టు జిల్లాలోని వైద్య మౌలికసదుపాయాలను బలోపేతం చేయడమే కాక, సకాలంలో తగిన వైద్య చికిత్స, సేవ అందించడం ద్వారా మహమ్మారిని ఎదుర్కోవడంలో స్థానిక పాలకులకు అవకాశాన్ని పెంచింది.

అంతేకాకుండా, సిఎస్ఆర్ కింద అదనంగా ఏడు ప్రాంతాలలో - ఉత్తరాఖండ్‌లోని పిత్తోడ్‌గఢ్ లో, ఖగారియాలోని బేన్ ఆసుపత్రిలో నిమిషానికి1000లీటర్లను ఉత్పత్తి సామర్థ్యం గల, ఛాత్రాలోని జిల్లా ఆసుపత్రిలో నిమిషానికి 600లీటర్లను ఉత్పత్తి సామర్థ్యం గల, హంతేర్ గంజ్ సిహెచ్‌సిలో నిమిషానికి 600లీటర్లను ఉత్పత్తి సామర్థ్యం గల, బారాన్‌లోని సివిల్ ఆసుపత్రిలో నిమిషానికి 400లీటర్లను ఉత్పత్తి సామర్థ్యం గల, బరాన్ మల్లాపురంలోని జిల్లా ఆసుపత్రిలో నిమిషానికి 1250 లీటర్ల ఉత్పత్తి సామర్థ్యం గల ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు మద్దతు అందిస్తోంది.

సిఎస్ఆర్ చొరవలో భాగంగా, పిజిసిఐఎల్ (పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) రెండు ప్రాంతాలలో - జైసల్మేర్ (రాజస్థాన్), గురుగ్రాం (హర్యానా)లో ఆక్సిజన్ ప్లాంట్లనుః తావోదేవీ లాల్ స్టేడియంలో 2 లీ 50 ఔఎ3ను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సాహాన్ని ఇస్తోంది.

మరింత పటిష్టంగా లాక్ డౌన్

హైదరాబాద్ , మే 17: కరోనా కట్టడికి రాష్ట్ర ప్రభు త్వం అమలు చేస్తున్న లాక్‌డౌన్‌ను మరింత పటిష్టంగా అమల య్యేలా పోలీసు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఉదయం పూట నాలుగు గంటల నడలింపు సమయంలో ప్రజలు కుప్పలు కుప్పలుగా రోడ్లపైకి రావడం, అందుకే పాజిటివ్ లక్షణాలున్న వారు కూడా ఉంటుండటంతో ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. సరుకుల కోసమన్న పేరుతో చాలా మంది ఉదయం పూట రోడ్లపైకి వస్తుండటాన్ని ఎక్కడికక్కడే కట్టడి చేయాలని నిర్ణయించారు. ఇదే సమ యంలో మార్కెట్లు రద్దీ లేకుండా ఉండేందుకు వీలుగా నిత్యా వసరాలు, ప్రధానంగా కూరగాయలు, పండ్లు ఇతరత్రా సరుకు లు వేర్వేరు చోట్ల అందుబాటులో ఉంచేలా చూడాలని నిర్ణయిం చారు. ఇందుకోసం స్థానిక సంస్థలకు చెందిన ప్రభుత్వ యం త్రాంగం సహకారాన్ని తీసుకోవాలని నిర్ణయించారు.

లాక్‌డౌన్ సడలింపు ఉదయం గం. 6 నుంచి 10 వరకు ఉన్నప్పటికీ చాలా మంది ఉదయం గం. 11, మధ్యాహ్నం గం. 12 ల వరకు తిరుగుతున్నారు. ఇలా కాకుండా ఖచ్చితంగా ప్రజలంతా గం.10 కల్లా ఇళ్ళల్లో ఉండేలా మార్కెట్లను తెరచి ఉంచేలా చూడాలని భావిస్తున్నారు. అదే విధంగా లాక్‌డౌన్ సమయంలో నిబంధనలను ఉల్లంఘించిన వారిపై గతంలో మాదిరిగా లాఠీలకు పని చెప్పకుండా స్మార్ట్ పోలీసింగ్ ద్వారా కట్టడి చేస్తున్నారు. రోడ్లపై తిరుగుతున్న వారిపై లాఠీలు రఝళిపించకుండా సీసీ కెమెరాలు, హ్యాండీకామ్‌లు, ట్రాఫిక్ పోలీసుల కెమరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి కేసులను నమోదు చేసే ప్రక్రియను మరింత ముమ్మరం చేయనున్నారు. కాలనీలు, బస్తీలలోనే పోలీసుల పికెట్లను, చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు స్థానిక యువజన సంఘాలు, బస్తీ సంఘాల సహకారంతో సరుకుల కోసం ఇంటికి ఒకరు చొప్పున మాత్రమే బయటకు వచ్చేలా చూసే విధానాన్ని అమలు చేయబోతున్నారు. మార్కెట్లలో తీవ్ర రద్దీ ఏర్పడటంతో వ్యాధి మరింతగా విస్తరించే ప్రమాదం ఉందంటూ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తుండటంతో కట్టడికి వీలైనన్ని చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ భావిస్తోంది. మాస్కులేకుండా కాలనీలలో తిరుగుతున్న వారిపై కూడా కేసులను నమోదు చేయాలని ఆదేశాలు అందాయి.

జిల్లాలలో కొంత మేర లాక్‌డౌన్ అమలవుతున్న హైదరా బాద్‌తో పాటు రాష్ట్రంలోని ప్రధాన పట్టణా లలో ఇబ్బందులు ఎదరువు తున్నా యని పోలీసు అధికారులు అంటున్నా రు. చిన్న చిన్న కారణాలను చూపి ప్రజలు రోడ్లపైకి విచ్చలవిడిగా వస్తున్నారని, కొన్ని చోట్ల పోలీసుల నుంచి తప్పించుకునేందుకు చెక్ పోస్టులు లేని రహదారులు, గల్లిటలను ఎంచు కుని వాహనాలపై చక్కర్లు కొడుతు న్నారని పేర్కొంటు న్నారు. ఇలా తిరుగుతున్న వారిని పోలీసులు పట్టుకుంటే అనారోగ్యమనీ, ఆస్పత్రులకు వెళ్తున్నామని చెప్పి తప్పించుకుం టున్నారని తెలిపారు.

ఇక మార్కెట్‌కు వచ్చే సమయంలో కొంత మంది మాస్క్‌లు లేకుండా వస్తున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే ఇంటి దగ్గరే కదా అని వచ్చామని, మరిచిపోయి వచ్చామని పిట్టథలు చెబుతున్నా రని పోలీసులు అంటున్నారు.

అదే విధగా తప్పనిసరిగా సామాజిక దూరం పాటించా లన్న నిబంధన లను ఎవరూ పట్టించుకోవడం లేదని, షాప్‌లు, మాల్స్ దగ్గర మార్కింగ్ ఉన్నప్పటికీ తమకు వర్తించదన్నట్లు వ్యవహరిసు ?తన్నారని చెబుతున్నారు. గ్రేటర్ హై దరా బాద్ పరిధి అంటే మూడు కమిష నర???ట్ల లోనే దాదా పు 350 చెక్‌పోస్టు లను ఏర్పాటు చేశా రు. అయినప్పటికి వాహనదారులు ఏ మాత్రం ఖాతర్ చేయకుండా యథేచ్ఛగా తిరుగుతున్నారు.

మాస్క్ లేకపోతే రూ.1000 జరిమానా

కరోనా సెకండ్ వేవ్ ప్రభావం తీవ్రంగా ఉండటం, గాలిలో వ్యాధి వ్యాపిస్తుందని నిపుణు లు చెబుతుండటం, మాస్క్ ధరించడం ద్వారా కరోనా వ్యాప్తిని అరికట్టవచ్చని సూచిస్తుండ టంతో ప్రతి ఒక్కరూ మాస్క్‌ను తప్పనిసరిగా ధరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మాస్క్ ధరించని వారిపై కేసు నమోదు చేయడం తో పాటు వెయ్యి రూపాయల జరిమానా కూడా విధించా లని ప్రభుత్వం ఆదేశిం చింది. అయిన ప్ప టికీ చాలా మంది మాస్క్ ధరించేందుకు విముఖత చూపుతున్నారు, నిబంధనలు అమలులోకి వచ్చినప్పటి నుంచి హైదరాబాద్ సిటీ పోలీసులు మాస్క్ ధరించని వారిపై 65 వేల కేసులను నమోదు చేశారు. వీరందరిపై కేసులను నమోదు చేశారు. లాక్‌డౌన్ అమలులోకి వచ్చిన బుధ వారం నుంచి ఆదివారం వరకు మాస్క్ లేకుండా రోడ్లపై తిరుగు తున్న వారిపై 7 వేల కేసులను నమోదు చేశారు. వీరందరికీ వెయ్యి రూపాయల జరిమానాను విధించారు. అదే విధంగా పబ్లిక్ గ్యాదరింగ్ కేసులను కూడా నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాలలో సిగరెట్ తాగడం, గుట్కా తిని ఉమ్మివేయడం, మద్యం తాగడం తదితర నేరాల కింద దాదాపు 10 వేల కేసులను కూడా కేసులను నమోదు చేశారు.

రెచ్చిపోతున్న చైన్ స్నాచర్లు

లాక్‌డౌన్ సడలింపులతో ప్రజలంతా ఒక్కసారిగా రోడ్లపైకి వస్తుండటంతో చైన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారు. గడచిన మూడు రోజులలోనే

సమాజానికి ఆవలి తీరాన 'థర్డ్ జెండర్' వర్గాలు

(17 మే 'అంతర్జాతీయ హోమోఫోబియా వ్యతిరేక దినం' సందర్భంగా)

'ఇంటర్నేషనల్ లెస్బియన్ అండ్ గే అసోసియేషన్ (ఐయల్‌జిఏ)' మరియు 'ఇంటర్నేషనల్ గే అండ్ లెస్బియన్ హూమన్ రైట్స్ కమిషన్' సంయుక్తంగా 17 మే 2005న ప్రారంభించిన 'అంతర్జాతీయ హోమోఫోబియా వ్యతిరేక దినం' సందర్భంగా ట్రాన్స్‌జెండర్ (లింగ మార్పిడి) వర్గం ఎదుర్కొంటున్న వివక్ష, చిన్న చూపు, నిరాదరణ, ఎగతాళికి గురి కావడం, పరుష మాటలను ప్రయోగించడం, భౌతిక దాడులు చేయడం మరియు హింసాత్మక పోకడలకు వ్యతిరేకంగా లోతైన అవగాహన కల్పించుట జరుగుతోంది. 17 మే 1990న ఐరాస మరియు డబ్ల్యూహెచ్ఓ నిర్ణయం ప్రకారం హోమో సెక్సువాలిటీ (స్వలింగ సంపర్కం) అనేది మానసిక రుగ్మత కాదని తీర్మానించడానికి గుర్తుగా 17 మే రోజును ఈ దినం పాటించుట జరుగుతున్నది. ఫ్రాన్స్ లాంటి దేశాలు ఏక-లింగ లైంగిక సంపర్క వ్యక్తుల (సేమ్ సెక్స్) మధ్య వివాహాలను కూడా అనుమతించడం జరిగింది. హోమోఫోబియా, బయోఫోబియా మరియు ట్రాన్స్‌ఫోబియా వర్గ ప్రజల సమస్యల్ని అర్థం చేసుకొని, వారి మానవ హక్కులకు విఘాతం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలనే సందేశాన్ని ఈ వేదిక కల్పిస్తున్నది. లెస్బియన్, గే, బయోసెక్సువల్ మరియు ట్రాన్స్‌జెండర్లు (యల్‌జిబిటి) స్వతంత్రంగా జీవించలేకపోతున్నారని, వీరిని నేరస్థులుగా చూసే దేశాలు కూడా ఉన్నాయని తెలుసుకోవాలి. యల్‌జిబిటి వర్గ ప్రజలు సభ్య సమాజానికి దూరంగా నెట్టబడుతూ, పలు మానసిక సమస్యలతో సతమతం అవుతూ, అనువిత్యం భయం భయంగా బతుకుతున్నారని, దీనినే హోమోఫోబియా అంటారని తెలుసుకోవాలి. లెస్బిఫోబియా, గేఫోబియా, బయోఫోబియా, ట్రాన్స్‌ఫోబియా లాంటివి అన్నీ హోమోఫోబియా పరిధిలోకి వస్తాయని అర్థం చేసుకోవాలి. యల్‌జిబిటి వర్గానికి చెందిన ప్రజల్ని ఆదరించడం, పరుషంగా మాట్లాడక పోవడం, సున్నతంగా ప్రవర్తించడం, సాధారణ జన జీవనస్రవంతిలో కలుపుకోవడం, హక్కుల్ని కాపాడటం, స్నేహితుల్లా మెలగడం, అన్ని వసతులు కల్పించడం, సాధారణ మనుషులుగా చూడడం, సంఘీభావాన్ని తెలియచేయటం లాంటి కార్యక్రమాలను చేపట్టాలి. అంతర్జాతీయ హోమోఫోబియా వ్యతిరేక దినం - 2021 నినాదంగా 'టుగెదర్ : రెసిస్టింగ్, సపోర్టింగ్, హీలింగ్' అనే అంశాన్ని తీసుకున్నారు. హోమోఫోబియాకు లోనైన ప్రజల్లో మానసిక ఒత్తిడి పెరిగి ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి కూడా రావచ్చని మనందరం గమనించాలి.

ఇండియాలో 2.5 మిలియన్ల యల్‌జిబిటి వర్గ ప్రజలు ఉన్నారని, అనేకులు బయటకు చెప్పడానికి భయపడుతూ, హోమోఫోబియాకు లోనవుతున్నారని తెలుస్తున్నది. భారత సమాజంలో 'థర్డ్ జెండర్' భావన విస్తృతంగా వినియోగించుట జరుగుతుంది. 2017లో సుప్రీమ్ కోర్టు యల్‌జిబిటి వర్గాన్ని గుర్తించడం, 2018లో గే సెక్స్‌ను చట్టబద్ధం చేయడం మరియు స్వతంత్ర భావనలను వ్యక్తం చేయడానికి అనుమతిని ఇచ్చింది. భారత యల్‌జిబిటి వర్గం మానసిక, భౌతిక, భావోద్వేగ మరియు ఆర్థిక వివక్షకు గురికావడమే కాకుండా కుటుంబ ఆదరణ, పోలీసుల రక్షణ కూడా కోల్పోవడం విచారకరం. కౌమార దశలోని యువతకు నిర్వహిస్తున్న 'సాథియా' విద్యా పథకంలో భాగంగా స్వలింగ సంపర్కం గూర్చి కూడా భోధించడం జరుగుతోంది. యల్‌జిబిటి సమూహాలు హింస, నిరుద్యోగం, వివక్ష, కుటుంబం వెలివేయడం, పాఠశాలల్లో వేదింపులు, సమాజ చిన్న చూపు లాంటి అసంఖ్యాక సమస్యలతో హోమోఫోబియాకు గురికావడం అనాదిగా జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో యల్‌జిబిటి జనులు నిరక్షరాస్యత, పేదరికం, మానసిక శారీరక అనారోగ్యం, శ్రమ దోపిడి, హక్కుల తరిగి పోవడం, హింసాత్మక దాడులు పెరగడం లాంటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. హోమోఫోబియా ఉచ్చులో చిక్కి మనిషిలా గుర్తించబడని దుస్థితిలో దుర్భర బతుకులు ఈడ్చుతున్న యల్‌జిబిటి వర్గాన్ని చులకనగా చూడకుండా సాటి మనుషులుగా ఆదరిస్తూ మానవత్వాన్ని ప్రదర్శిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

గద్వాలలో కరోనా రోగులకు నిత్యాన్నదానం

జోగులాంబ గద్వాల, మే 17 : జిల్లా దవాఖానలో కరోనాతో చేరిన రోగులకు నిత్య అన్నదానం చేయనున్నట్లు ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులకు నిత్య ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్యం కోసం వస్తున్న నిరుపేదలు, అభాగ్యులు, బాధితులు ఎవరూ కూడా అన్నం లేక అల్లాడ కూడదనే ఉద్దేశంతో దాతల ప్రోత్సాహంతో రోగులకు, వారి సహాయకులకు ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు.

గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న కరోనా రోగులు, వారి కుటుంబాలకు మొత్తం 630 మందికి ఎమ్మెల్యే ఆహారం అందజేశారు. కొవిడ్ చికిత్సతోపాటు వైద్య పరీక్షల నిమిత్తం గద్వాల పట్టణానికి విచ్చేస్తున్న అనేక మంది బాధితులు భోజన సదుపాయాలు, హోటల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బాధితులకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అభిమానుల సహాయంతో ఆహారాన్ని అందజేస్తానని ఆయన తెలిపారు. అదేవిధంగా దాతలు ఎవరైనా ఉంటే ముందుకు రావాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సమయంలోనే మానవతా దృక్పథంతో సహృదయతను చాటాలన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీయస్ కేశవ్, జెడ్పీటీసీ రాజశేఖర్, జిల్లా వైద్యాధికారి చందు నాయక్, వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్స్ నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, నాగరాజు, టీఆర్ఎస్ నాయకుడు ఆలూరు రాము శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో రూ.1999కే సిటీ స్కాన్

మహబూబ్ నగర్. , మే 17 అవసరం ఉన్నా లేకపోయినా సిటీ స్కాన్ రాస్తూ కొందరు డాక్టర్లు సొమ్ము చేసుకుంటున్నారని, అర్హత ఉన్న డాక్టర్లు రాసిన ప్రిస్క్రిప్షన్ ప్రకారమే సిటీ స్కాన్ తీయాలని ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లను మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశించారు. కరోనా వల్ల ఎందరో నిరుపేదలు సిటీ స్కాన్ తీసుకునేందుకు ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్ లోకి వస్తున్నారని.. పేదలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు వీటికి ఫిక్స్ ధరలు విధిస్తున్నామని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సిటీ స్కాన్ ధరలు రూ. 1999గా నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. ఫిల్మ్ తో సహా రిపోర్ట్ కావాలంటే రూ. 2790 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కరోనా కష్టకాలంలో నిరుపేదలకు ఇబ్బంది కాకుండా ఉండేందుకు సిటీ స్కాన్ ధరలను రూ. 5 వేల నుంచి రూ. 1999కు తగ్గించినట్లు మంత్రి వెల్లడించారు.

వరంగల్, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలలో సిటీ స్కాన్ ధరను రూ.2 వేలకు తగ్గించారని.. అదే బాటలో మహబూబ్ నగర్ జిల్లాలోనూ తగ్గించినట్లు ఆయన తెలిపారు. సోమవారం నుంచే ఈ ధరలు అమలులోకి వచ్చాయని తెలిపారు. కొందరు వైద్యులు 30 నుంచి 40 శాతం సిటీ స్కాన్ రెఫరల్ ఫీజుకు ఆశపడి అవసరం ఉన్నా లేకపోయినా రోగులను డయాగ్నోస్టిక్ సెంటర్లకు పంపిస్తున్నారని.. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఒక్క సిటీస్కాన్ వల్ల భవిష్యత్తులో దుష్పరిణామాలు ఉంటాయన్నారు. అందుకే క్వాలిఫైడ్ పల్మోనాలజిస్ట్ మాత్రమే సిటీ స్కాన్ రాయాలన్నారు. తగ్గించిన సిటీ స్కాన్ ధరలు అమలు చేయకుంటే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

జిల్లాలో 13 దవాఖానాల్లో వైద్యం అందిస్తున్నారని ఇందులో 1345 పడకలు ఉండగా 20శాతం అంటే 269 పడకలు ప్రభుత్వానికి కేటాయింపు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రైవేట్ లోని ఈ 269 పడకలు అత్యంత నిరుపేదలకు కేటాయిస్తామన్నారు. ఇంజక్షన్లు, మందుల ఫీజులు మాత్రమే వసూలు చేయాలని తెలిపారు.

ప్రైవేట్ దవాఖాన యాజమాన్యాలు ప్రస్తుతం నెలకొన్న ఇబ్బందికర పరిస్థితుల్లో పేదల నుంచి అత్యధిక ఫీజులు వసూలు చేసి వాళ్లను ఇబ్బందులకు గురి చేయవద్దని మానవత్వంతో స్పందించాలని కోరారు.

మహబూబ్నగర్ జనరల్ దవాఖాన లో హైదరాబాద్ కార్పొరేట్ స్థాయిలో అధునాతన వైద్యం అందిస్తున్నారని మంత్రి తెలిపారు. వ్యాధి ముదిరే వరకు చూడకుండా లక్షణాలు కనిపించగానే ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ స్వర్ణ, అడిషనల్ కలెక్టర్ నందలాల్ పవార్, డీఎంహెచ్ఓ డా కృష్ణ, ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్స్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీపీ సుధా శ్రీ ఉన్నారు.

సూర్యాపేటలో రెమ్‌డెసివియర్ బ్లాక్ దందా ముఠా అరెస్ట్

సూర్యాపేట మే 17: రెమ్‌డెసివియర్ ఇంజక్షన్లు అధిక ధరలకు విక్రయిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. సూర్యాపేట పట్టణంలో రెమ్‌డెసివియర్ ఇంజక్షన్లను అధిక ధరలకు అమ్ముతున్నారనే విశ్వసనీయ సమాచారంతోటౌన్ సీఐ ఏ. ఆంజనేయులు పర్యవేక్షణలో ఎస్ఐలు నరేందర్ రెడ్డి, పి.శ్రీనివాస్, సిబ్బందితో కలిసి ఓ ప్రైవేట్ హాస్పిటల్‌పై దాడులు నిర్వహించారు. హాస్పిటల్ మేనేజర్, అతనితో ఉన్న మరో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

ఇంజక్షన్లను కృత్రిమ కొరత సృష్టించి వాటి డిమాండ్ ను బట్టి 30-35 వేల రూపాయల వరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. వారిపద్ద నుంచి 30 ఇంజక్షన్లు,సెల్ ఫోన్స్, బాలెనో కారును స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధరల షాక్ : ఏప్రిల్‌లో 10.46 శాతం పెరిగిన ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ, మే 17: ముడి చమురు ధరల సెగతో దేశవ్యాప్తంగా ఏప్రిల్ లో టోకు ధరల సూచీ(డబ్ల్యూపీఐ) ఆల్ టైం హైగా 10.49 శాతానికి ఎగబాకింది. ముడిచమురు, నూనెలు, కమాడిటీ ధరల పెరుగుదలతో ఏప్రిల్ లో టోకు ధరల ద్రవ్యోల్బణం రెండంకెలకు ఎగిసిందని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడించాయి. మార్చిలో 7.39 శాతంగా నమోదైన డబ్ల్యూపీఐ ఏప్రిల్ లో ఆల్ టైం హైకి చేరింది.

ముడి చమురు, పెట్రో ఉత్పత్తులు, తయారీ వస్తువుల ధరల పెరుగుదలతో ఏప్రిల్ లో వార్షిక ద్రవ్యోల్బణ రేటు పెరిగిందని మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు తెలిపాయి. ఇక ఆహారోత్పత్తుల ధరలు తగ్గడంతో ఏప్రిల్ లో వినిమయ ధరల సూచీ 4.29 శాతానికి తగ్గడం కొంత ఊరట ఇస్తోంది.

ఏపీలో కర్ఫ్యూ పొడిగింపు..

అమరావతి, మే 17: కరోనా వైరస్ నియంత్రణకు అమలు చేస్తున్న కర్ఫ్యూను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పొడిగించింది. ఈ నెలాఖరు వరకు కర్ఫ్యూను పొడిగిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేసులు తగ్గాలంటే కనీసం 4 వారాలు కర్ఫ్యూ అమల్లో ఉండాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కర్ఫ్యూ పెట్టి 10 రోజులే అయిందన్నారు. కరోనా కేసులను తగ్గించేందుకు మరోసారి కర్ఫ్యూను పొడిగిస్తున్నట్లు సీఎం జగన్ ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో కేసులు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. పరిస్థితి అదుపులోకి రావాలంటే మరికొంత సమయం పడుతుందని సీఎ జగన్ స్పష్టం చేశారు.

సీఎం సహాయనిధికి రూ.30 లక్షల విరాళం అందించిన విక్రమ్

హైదరాబాద్ , మే 17: ప్రస్తుతం దేశ వ్యాప్తంగా కరోనా సెకండ్ వేవ్ ప్రకంపనలు పుట్టిస్తుంది. రోజురోజుకు కరోనా భారీగా పెరుగుతూ పోతున్న నేపథ్యంలో ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికే కరోనా బారిన పడి ఎంతో మంది తనువు చాలించారు. ఇందులో సినీ ప్రముఖులు ఉన్నారు. అయితే కోవిడ్ నుండి ప్రజలను రక్షించేందుకు సినీ సెలబ్రిటీలు తమ వంతు విరాళాలు అందిస్తున్నారు. తాజాగా చియాన్ విక్రమ్ ఆన్‌లైన్ ద్వారా తమిళనాడు ప్రభుత్వ నిధికి 30 లక్షల రూపాయలు పంపించారు. భారీ మొత్తంలో విక్రమ్ విరాళాలు అందించడంపై అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తమిళ నాట పెరుగుతున్న కోవిడ్ ప్రభావం నిమిత్తం అనేకమంది సినీ తారలు తమిళనాడు ప్రభుత్వ నిధికి భారీ మొత్తంలో విరాళాలు అందించారు. ఇప్పటికే సూర్య, కార్తీ సోదరులు కోటి విరాళం అందించగా, మురుగదాస్ రూ. 25 లక్షలు, అజిత్ 25 లక్షలు, సౌందర్య రజనీకాంత్ భర్త విశాగణ్ కోటి రూపాయలు , దర్శకుడు వెట్రిమారన్ ,రూ. 10 లక్షలు, ఎడిటర్ మోహన్, ఆయన తనయుడు మోహన్ రాజా, జయం రవి రూ. 10 లక్షల రూపాయలు, తమిళ నటుడు శివ కార్తికేయన్ విరాళం కింద పాతిక లక్షలు, శంకర్ రూ. 10 లక్షల రూపాయలు అందించారు. ఈ రోజు సూపర్ స్టార్ రజనీకాంత్ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ని కలిసి రూ.50 లక్షల రూపాయలు విరాళం అందించారు.

గోమూత్రంతో కరోనా దరిజేరదు: ప్రగ్యా ఠాకూర్

న్యూఢిల్లీ, మే 17: కోవాగ్జిన్లు, రెమ్‌డెసివిర్లు ఏవీ అక్కర లేదు. కరోనా మహమ్మారిని తరిమి కొట్టేందుకు గోమూత్రం తాగితే చాలట. అదీ దేశీ గోమూత్రం అయితేనే ఫలితాలు ఉంటాయట. వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తలకెక్కే బీజేపీ ఎంపీ ప్రగ్యా ఠాకూర్ ఇచ్చిన సలహా ఇది. తాను రోజూ గోమూత్రం తీసుకుంటారట. అందుకే కరోనా ఇంతవరకు తన దరి జేరలేదట. అదీ సంగతి. ఈ మాత్రం మన వైద్యనిపుణులకు తెలియకపాయే. రోజూ గోమూత్రం తాగితే కరోనా వల్ల ఊపిరి తిత్తుల్లో ఏర్పడ్డ జబ్బు నయమైపోతుందని ఆమె పేర్కొన్నారు. గోమూత్రం అపర సంజీవని ఆమె సెలవిచ్చారు. గోమూత్రంతో మరికొన్ని గోపదార్థాలు కలిపి సేవిస్తే తనకు కేన్సర్ తగ్గిందని రెండేళ్ల క్రితం ప్రగ్య ప్రకటించారు. 2020 డిసెంబర్ లో కోవిడ్ లక్షణాలతో ఆమె ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరారు. రుజువు కాని ప్రక్రియలతో ప్రామాల మీదకు తెచ్చుకోవగద్దని డాక్టర్లు పదేపదే ప్రజలను హెచ్చరిస్తున్న సంగతి తెలిసిందే. ఆవుపేడ గానీ, గోమూత్రం గానీ కోవిడ్ రాకుండా చూస్తాయని లేదా వచ్చిన తర్వాత నయం చేస్తాయనడానికి శాస్త్రీయమైన ఆధారాలేవీ లేవని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అనేకసార్లు ప్రకటించింది. కోవి?డ-19కు వ్యతికంగా రోగనిరోధక శక్తిని గోమూత్రం, పేడ అందిస్తాయని ఎక్కడా రుజువు కాలేదని ఐఎంఏ అధిపతి డాక్టర్ జేఏ జయలాల్ తెలిపారు.

రైతులకు వెన్ను దన్నుగా ఉంటాం

సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరాయలు

రాజన్న సిరిసిల్ల మే, 17(నేటినిజం ప్రతినిధి): ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు వెన్నుదన్నుగా ఉంటామని వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం సింగిల్విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరాయలు అన్నారు. వర్షాలు దృష్టిలో పెట్టుకొని రైతులు నష్టపోకుండా రుద్రవరం సింగిల్ విండో పరిధిలోని రుద్రవరం, ఆరపెల్లి, అయ్యోరుపల్లి ,సంకెపెల్లి గ్రామ ల రైతుల పరి ధాన్యాన్ని సకాలంలో తూకం వేసి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని రుద్రవరం సింగిల్విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరాయలు ఒక ప్రకటనలో తెలిపారు

లాక్ డౌన్ నిబంధనలు పాటించి జిల్లా పోలీసు యంత్రాంగానికి సహకరించండి

-వాహనాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్ల మే, 17(నేటినిజం ప్రతినిధి): జిల్లా ప్రజలందరూ లాక్ డౌన్ నిబంధనలు పాటించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు .లాక్ డౌన్ దృష్యా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే సోమవారం స్వయంగా సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద క్షేత్ర స్థాయిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు.

ఈ తనిఖీల్లో ఎలాంటి కారణం లేకుండా రోడ్ల మీదకు వచ్చిన వారితో పాటు లాక్ డౌన్ నిబంధనలు అతిక్రమించి వాహనాల్లో ప్రయాణించే వాహనాలపై జరిమానాలు విధించాల్సిందిగా పోలీస్ అధికారులను ఎస్పీ అదేశించారు. వాహన చెకింగ్ సమయాల్లో అధికారులు సిబ్బంది తీసుకోవాల్సిన ముందస్తు చర్యలతో పాటు, లాక్ డౌన్ నిబంధనలను అతిక్రమించిన వారిపై తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా ఎస్పీఅధికారులకు పలుసూచనలు చేసారు. అదే విధంగా ప్రధాన రోడ్డు మార్గల్లోనే కాకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇతర మార్గల్లోను ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించే విధంగా తగు చర్యలుతీసుకోవాల్సిందిగా ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో లాక్ డౌన్ నిబంధనలు మరియుకొవిడ్ నిబంధనలుఉల్లంఘించిన వారిపై డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్ట్ కింద నిన్న(227) కేసులు నవోదు చేయడం జరిగింది అని అన్నారూ. చిన్న చిన్న కారణాలతో బయటకి వస్తున్నారు అని వారి పై క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుంది అని అన్నారు

జిల్లా ప్రజలు అందరు లాక్ డౌన్ నిబధనలు పాటించి జిల్లా పోలీస్ యంత్రగానికి సహాయపడలని కోరారు. ఎస్పీ వెంట సిరిసిల్లడిఎస్పీచంద్రశేఖర్,సి.ఐ అనిల్ కుమార్ ,ఎస్.ఐ సుధాకర్,ట్రెని ఎస్.ఐ సంధ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపద సమయంలో పేదల ఆకలి తీరుస్తున్న మనసున్న మా రాజు టి .ఆర్. కే

-మూడవ రోజు నిరుపేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ

రాజన్న సిరిసిల్ల మే, 17(నేటినిజం ప్రతినిధి): ఆపద సమయంలో అండగా ఉంటామని పేదల తీరుస్తామంటూ టిఆర్ కే ట్రస్ట్ సైన్యం మూడవరోజు కూడా సోమ వారం వేములవాడ పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉండే వలస జీవులకు, కూలీలకు, ఆలయ పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేసే వారికి ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టి.ఆర్.కె ట్రస్ట్ డైరెక్టర్ ×మొట్టల మహేష్ కుమార్× మాట్లాడుతు లాక్ డౌన్ పూర్తయ్యేవరకు టి ఆర్ కె ట్రస్ట్ తరపున నిరుపేదలకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేస్తామని, ఆపద సమయంలో అండగా ఉండేందుకు తాము ముందు ఉంటామని అన్నారు. లాక్ డౌన్ ఎన్ని రోజులు ఉంటే అన్ని రోజులు ట్రస్టు తరపున పేదలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం టి.ఆర్.కె ట్రస్ట్ ప్రతినిధులు ముప్పిడి శ్రీధర్, రాకేష్ మాట్లాడుతులాక్ డౌన్ సమయంలో ఎందరో నిరుపేదలు తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకొని టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ ముందుకు వచ్చి నిరుపేదల ఆకలిని తీర్చడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నిరుపేదలకు ట్రస్ట్ సేవలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ కె వర్కింగ్ టీం, ఎంక్వయిరీ టీం సభ్యులు పాల్గొన్నారు.

డిబిటి లబ్ధిదారులు ఫినో కిసాన్ యోజన నిధులను ఫినో బ్యాంకింగ్ పాయింట్ల లబ్ధి

ముంబయి, మే 17 ప్రభుత్వ ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డిబిటి) పథకం, పిఎమ్ కిసాన్ యోజన లబ్ధిదారులకు నగదును అందించడం ద్వారా మహమ్మారి వ్యాప్తి చెందుతున్న సమయంలో భారతదేశ వ్యవసాయ సమాజానికి సహాయం చేయడానికి దేశవ్యాప్తంగా ఫినో పేమెంట్స్ బ్యాంక్ యొక్క మర్చంట్ పాయింట్లు సిద్ధంగా ఉన్నాయి. రూ. 9000 కోట్లు నేరుగా 9.5 కోట్లకు పైగా లబ్ధిదారుల రైతు కుటుంబాల ఖాతాల్లోకి చేరాయని ప్రధాని నరేంద్ర మోడీ ఈ రోజు ప్రకటించారు. ప్రతి రైతు లబ్ధిదారుడు తన బ్యాంకు ఖాతాలో రూ. 2,000 పొందుతాడు. ఏ బ్యాంకులో ఖాతా ఉన్నప్పటికీ, డిబిటి పథకం లబ్ధిదారులు నగదు తీసుకోవడానికి లేదా మరే ఇతర బ్యాంకింగ్ లావాదేవీలు చేయడానికి సమీప ఫినో పాయింట్‌ను సందర్శించవచ్చు. కిరాణా, మెడికల్ స్టోర్స్, డెయిరీ షాపులు మరియు మైక్రో ఎటిఎం మరియు ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఎవఖా) పరికరాలతో కూడిన భారత్ పెట్రోలియం అవుట్‌లెట్‌లు వంటి చెంతనే ఉన్న చిన్న వ్యాపారులే ఫినో పాయింట్లు. సమీప ఫినో పాయింట్‌ను కనుగొనడానికి, ప్రజలు https://fino.latlong.in/ URL పై క్లిక్ చేయవచ్చు లేదా ఖిఖీ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు. "అవసరం ఉన్న ఏ సమయంలోనూనా, ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్న బ్యాంకింగ్ సేవలు"అని ఫినో పేమెంట్స్ బ్యాంక్ సిఎస్ఓ శైలేష్ పాండే చెప్పారు. "ఫినో యొక్క హమేషా అందుబాటులో ఉండే అవుట్‌లెట్, బయటకు కదిలేందుకు వీలు లేని ఈ క్లిష్ట సమయంలో, ప్రజలకు సౌకర్యాన్ని అందించేందుకు ఎక్కువ గంటలు తెరిచి ఉంటుంది. లబ్ధిదారులు ఎప్పుడైనా పాయింట్లలోకి వెళ్లవచ్చు లేదా నగదు తీసుకోవడానికి లేదా వారి కుటుంబానికి డబ్బు పంపించడానికి డోర్ స్టెప్ సేవలను పొందవచ్చు. మరీ ముఖ్యంగా బిపిసిఎల్ అవుట్‌లెట్‌లతో సహా మా పాయింట్ల వద్ద నగదు ఎల్లప్పుడూ లభిస్తుంది. అవసరమయ్యే ఈ సమయంలో వ్యవసాయ సమాజానికి అనుకూలమైన బ్యాంకింగ్ సదుపాయం కల్పించడమే మా లక్ష్యం." పిఎం కిసాన్ యోజన ఆర్థిక ప్రయోజనం అర్హతగల రైతు కుటుంబాలకు సంవత్సరానికి రూ. 6000, మూడు సమానమైన వాయిదాలలో 4 నెలలకు ఒకసారి 2,000 రూపాయలు. 21-22 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడత చెల్లింపు 14 మే. 2020లో లాక్డౌన్ సమయంలో, ఫినో మర్చంట్ నెట్‌వర్క్ పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు స్థానిక మరియు డోర్ స్టెప్ బ్యాంకింగ్‌ను సులభతరం చేసింది. స్థానికంగా తెలిసిన ప్రజలు ఫినో మర్చంట్ని రోజులో ఏ సమయంలోనైనా నగదు అవసరం కోసం సంప్రదించేవారు. ఈ సేవ, సీనియర్ సిటిజన్లు, మహిళలు మరియు పెన్షనర్లకు గొప్ప సౌకర్యాన్ని అందించింది. విత్ డ్రా చేసుకున్న వారిలో ఎక్కువ భాగం సామాజిక భద్రత పెన్షన్, పిఎమ్‌జెడివై, పిఎం కిసాన్ యోజన వంటి పథకాల డిబిటి లబ్ధిదారులే. ఫినో పాయింట్ల వద్ద, ప్రజలు కొత్త ఖాతాను తెరవవచ్చు మరియు నగదు డిపాజిట్, డబ్బు బదిలీ, యుటిలిటీ బిల్లు మరియు రుణ ఇఓఎ చెల్లింపు సేవలను కూడా పొందవచ్చు మరియు ఆరోగ్యం, జీవిత మరియు మోటారు భీమాను కొనుగోలు చేయవచ్చు.


విశాలాక్షి
సాహిత్య మాస పత్రిక
శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి
స్మారక కథల పోటీ
విశాలాక్షి సాహిత్యమాస పత్రిక సంక్రాంతి కథల పోటీ నిర్వహించిన
విజయానందంలో ఇప్పుడు శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి స్మారక కథల పోటీతో
మరోసారి కథా రచయిత (త్రు)లకు చేరువవుతుంది. సంక్రాంతి కథల ప్రత్యేక సంపుటి లానే
మరో కథల సంపుటిని ప్రత్యేకంగా తీసుకు వచ్చే ప్రయత్నంలో ఉన్నాము. మీరంతా బహుమతులతో,
మంచి తెలుగు కథలతో ప్రత్యేక సంపుటిని తెలుగు కథా సాహిత్యంలో చిరస్థాయిగా నిలిపేలా
భాగస్వాములయ్యేందుకు కొత్త కలంతో, సిరా బలంతో ముందుకు రావాలని మీ అందరికీ
స్వాగతం పలుకుతున్నాము.
బహుమతుల వివరాలు
వేసవి కథల సంపుటి కోసం
15 కథలు ఎంపిక జరుగుతుంది.
ఒక్కో కథకు రూ. 3000/-
సమాన బ